
జంగారెడ్డిగూడెం: కరెన్సీ నోట్ల అలంకరణలో గంగానమ్మ


భీమవరం: ధనలక్ష్మి అలంకరణలో వాసవీమాత



మహాలక్ష్మీ లోకశోక వినాశిని

భీమవరం ఆధ్యాత్మికం, జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఉమ్మడి జిల్లాలో వైభవంగా కొనసాగుతున్నాయి. భీమవరంలో వాసవీమాతను మంగళవారం రాత్రి రూ.3 కోట్ల విలువైన నగదు, స్వర్ణంతో ధనలక్ష్మి రూపంలో అలంకరించారు. భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ ఉత్సవమూర్తిని లలితా త్రిపుర సుందరి దేవిగా అలంకరించారు. జంగారెడ్డిగూడెంలో గంగానమ్మను రూ.2.30 కోట్లు, విజయదుర్గమ్మను రూ.కోటి, వాసవీమాతను రూ.72 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు.

సాగులో సాంకేతికకు ప్రోత్సాహం



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: సాగులో ఆధునిక సాంకేతికత ఉపయోగించేలా రైతుల్ని ప్రోత్సహించాలని కలెక్టర్ నాగరాణి అధికారులకు సూచించారు. డీఆర్‌డీఏ, వ్యవసాయ శాఖ, బైర్రాజు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వరిసాగులో డ్రోన్ల వినియోగంపై స్వయం సహాయక సంఘాల సభ్యులకు కలెక్టరేట్‌లో మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొలాల్లో మందుల పిచికారీకి డ్రోన్లు వినియోగిస్తే సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన ఆరు స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇప్పటికే డ్రోన్లను అందించి శిక్షణ ఇచ్చారన్నారు.

రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం.. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఈ నెల 14న నిర్వహించనున్న పల్లె పండగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ నాగరాణి అధికారులకు సూచించారు. గ్రామ సభలో తీర్మానం చేసిన అన్ని పనులను భూమి పూజ చేసి ప్రారంభించాలన్నారు. పనుల వివరాలు ప్రజలకు తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ పనుల్లో రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నిర్వహించిన దూరదృశ్య సమావేశాన్ని ఆమె కలెక్టరేట్ నుంచి వీక్షించారు. ★ తాడేపల్లిగూడెం ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన వై.భవానీశంకరి మంగళవారం భీమవరం వచ్చి కలెక్టర్ నాగరాణిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

జేసీ ఆకస్మిక తనిఖీలు

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాలం చెల్లిన సరకులు విక్రయిస్తే సహించేది లేదని సంయుక్త కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. భీమవరం మార్కెట్ ప్రాంతంలోని పలు దుకాణాల్లో ఆయన సోమవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు చేశారు. కాలం చెల్లిన కారం, వేరుశనగనూనె ప్యాకెట్లు, శనగపప్పు తదితర సరకులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. తూనికలు కొలతల శాఖ అధికారులు సంబంధిత దుకాణదారులపై నాలుగు కేసులు నమోదు చేశారు.

అవినీతి మోత






నిబంధనలకు విరుద్ధంగా క్వారీల నిర్వహణ

జనావాసాల నడుమ పేలుళ్లు

ఈనాడు, ఏలూరు, చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో క్వారీల తవ్వకాలకు అడ్డగోలుగా అనుమతులిచ్చేస్తున్నారు. జనావాస ప్రాంతాల్లో బాంబులు పెట్టి పేలుస్తున్నా..అధికారులకు వినిపించడం లేదు. గోరంత అనుమతులుంటే కొండంత తవ్వేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులకు కనిపించని దుస్థితి నెలకొంది.

ఇది చింతలపూడి మండలం ఫాతిమాపురంలోని నల్లరాయి క్వారీ. దీని చుట్టూ గ్రామస్థులు నివాసం ఉంటున్నారు. సమీపంలో పంట పొలాలున్నాయి. ఇందులో నిత్యం బాంబులు పెట్టి రాళ్లు పగలకొడుతుంటారు. దుమ్ము ధూళితో విపరీతమైన కాలుష్యం ఆవరిస్తోంది. ప్రజలకు ఇన్ని ఇబ్బందులున్నా అధికారులు అనుమతులిచ్చేశారు. ఎలా అన్నది కోటి రూపాయల ప్రశ్న.



ఈ చిత్రంలో పగిలిన గోడ ఏ భూకంపం వల్లనో.. ప్రకృతి విపత్తు వల్లనో పగల్లేదు. ఫాతిమాపురం క్వారీల్లో పేల్చే బాంబుల ధాటికి ఇలా అయ్యాయి. గ్రామంలో చాలా ఇళ్లు ఇలా బీటలు పడిపోయాయి. క్వారీ పైనుంచి ఎప్పుడు రాళ్లు పడతాయో తెలియక ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బతుకుతున్నారు. ఇప్పటికే కొందరికి రాళ్లు తగిలి గాయాలయ్యాయని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు.

అడ్డగోలుగా అనుమతులు.. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం క్వారీ అనుమతుల విషయంలో కొన్ని నిబంధనలున్నాయి. పేలుడు అవసరం లేని క్వారీలు జనావాసానికి 100 మీటర్ల అవతల ఉండాలి. పేలుడు అవసరం ఉన్న క్వారీలు జనావాసానికి 200 మీటర్ల అవతల ఉండాలి. బాంబులు పేల్చాలంటే డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ అనుమతులుండాలి. మైన్స్ మేనేజర్ పర్యవేక్షణలోనే పేలుళ్లు జరగాలి. ఫాతిమాపురం క్వారీలో నిత్యం బాంబులు పేలుస్తారు. క్వారీని ఆనుకునే ఊరు ఉంది. దీంతో ఇళ్లు పునాదులతో సహా కదిలిపోతున్నాయి. గోడలు పగలిపోతున్నాయి. కళ్ల ముందు కనిపిస్తున్నా అధికారులు అడ్డగోలుగా అనుమతులిచ్చేశారు.

ప్రమాదంతో సహజీవనం.. బాంబులు పేల్చినప్పుడు వెలువడే కార్బన్ మోనాక్సైడ్, అమ్మోనియా తదితర ప్రమాదకర వాయువులు వెలువడటంతో భరించలేని దుర్గంధం వస్తోంది. వీటి వల్ల ఊపిరితిత్తులు, వినికిడి, కళ్లు, జీర్ణకోశ సంబంధిత వ్యాధులు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. గుండెపోటు, కొన్ని రకాల క్యాన్సర్ కూడా వచ్చే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. బాంబులు పేల్చే ముందు కనీసం గ్రామస్థులకు సమాచారం కూడా ఇవ్వడం లేదు.

అక్రమాలకు అడ్డాగా.. జిల్లాలో ద్వారకాతిరుమల, చింతలపూడి, టి.నరసాపురం, ముసునూరు, చాట్రాయి తదితర మండలాల్లో అనుమతులున్న క్వారీలు 22 ఉన్నాయి. అనుమతులు లేకుండా నిర్వహించేవి పదుల సంఖ్యలో ఉన్నాయి. కొయ్యలగూడెం మండలం గంగవరంలో అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. ఉంగుటూరు, భీమడోలు, నూజివీడు ముసునూరు మండలాల్లో అనుమతులు లేకుండా తవ్వేస్తున్నారు. అనుమతులున్నా వాటిని మించి తవ్వేస్తున్నారు. దీనిపై గనుల శాఖ ఏడీ రవికాంత్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇది చాట్రాయి మండలం పోతనపల్లి శివారులోని క్వారీ. అధికారుల లెక్కల్లో మాత్రం ఇందులో పనులు జరగడం లేదు. క్షేత్రస్థాయిలో యథేచ్ఛగా పనులు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం గనుల శాఖకు రాయల్టీ చెల్లించకపోతే పనులు నిలిపేయాల్సి ఉన్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

జిల్లాలో అనుమతులున్న క్వారీల సమాచారం		
22	మొత్తం సంఖ్య	
13	ప్రస్తుతం తవ్వకాలు జరుగుతున్నవి	
9	తవ్వకాలు నిలిచిపోయినవి	

సా..గదీత పనులు



భీమవరం పట్టణంలో ప్రధాన పైపులైన్ల నుంచి నీరు వృథా అవుతుంది. సంచులతో నీటిని కట్టడి చేయడానికి చేసే ప్రయత్నాలు సఫలం కావడంలేదు.



పశ్చిమగోదావరి జిల్లా కేంద్రమైన భీమవరంలో రహదారుల పక్కన నీరు ఎప్పుడూ ఉంటుంది. పైపులైన్లు దాదాపు 12 ప్రాంతాల్లో మరమ్మతులతో ఉండటంతో నీరు రహదారులపై చేరి చిత్తడిగా ఉంటుంది. శివారు ప్రాంతాలకు ఇంకా అమృత్ నీరు చేరలేదు. పాతపైపులైన్ల నుంచి వచ్చేనీరు లీకేజీలతో కలుషితమవుతున్నాయి.

ఎన్నేళ్లయినా దరిచేరని అమృత్ జలాలు

పట్టణ ప్రజలకు తప్పని తాగునీటి కష్టాలు

భీమవరం పట్టణం, తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరందించేలా అమృత్ పథకాన్ని ఏడేళ్ల కిందట ప్రారంభించారు. ఆరంభంలో పనులు చకచకా సాగాయి. వైకాపా అధికారం చేపట్టాక అయిదేళ్లకాలంలో ఎక్కడి పనులు అక్కడే అన్నట్టుగా మారాయి. దీంతో ఎక్కడ చూసినా పైపులైన్ల మరమ్మతులతో నీరు వృథా అవుతోంది. శివారు కాలనీలకు నీరందదు, ఇంటింటికి కుళాయి పూర్తికాలేదు. ప్రస్తుతం పనులు వేగవంతం చేశామని జిల్లా ప్రజారోగ్య విభాగ డీఈ విజయ్ చెప్పారు.

వేలాడుతున్న పైపులైన్ల గొట్టాలు

భీమవరం, తాడేపల్లిగూడెంలను అమృత్ మొదటి విడతలో ఎంపిక చేసి రెండు విడతలుగా రూ.225.88 కోట్లు కేటాయించారు. పాత మంచి నీటి పైపులను తొలగించి వాటి స్థానే కొత్తవి ఏర్పాటుతోపాటు ఇంటింటా కుళాయిలను ఏర్పాటు చేయాలి. ఇందుకోసం ఏర్పాటు చేసిన గొట్టాలను చాలాచోట్ల బిగించకపోవడంతో ముక్కలయ్యాయి. కొత్తగా వేసిన కొన్ని పైపులైన్ల నుంచి నీరు రావడం లేదు. భీమవరంలోని నర్సయ్యఅగ్రహారం, దుర్గాపురం, రామలక్ష్మణ్‌నగర్‌లో నిర్మించిన మంచినీటి సర్వీసు రిజర్వాయర్ల నుంచి పూర్తిస్థాయి నీరు అందడం లేదు. వీటికి ప్రధాన పైపులైన్ల నుంచి అనుసంధాన పనులు పూర్తికాలేదు. సాంకేతిక కష్టాలున్నాయి.


తాడేపల్లిగూడెం: కుంచనపల్లి గ్రామంలో కడియపు చెరువు

★ తాడేపల్లిగూడెంలోని 35 వార్డుల్లో చాలా ప్రాంతాలకు ఇంటింటి కుళాయిలు బిగించలేదు. జిల్లాలోనే పెద్ద చెరువుల్లో ఒకటైన కుంచనపల్లిలో 50 ఎకరాల విస్తీర్ణంలో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణానికి రూ.60 కోట్లు కేటాయించారు. పనులు చేపట్టలేదు. ఏలూరు కెనాల్ నుంచి నీటిని ఇక్కడకు మళ్లించి నిల్వచేసి వేసవి దాహార్తి తీర్చాలనేది లక్ష్యం.

రూ.51.03 కోట్లు.. 423 పనులు

14 నుంచి 'పల్లె పండగ'

భీమవరం టూటౌన్, పాలకోడేరు, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో పంచాయతీలకు పైసా విదల్చక పోగా కేంద్రం నుంచి వచ్చిన నిధులను సైతం పక్కదారి పట్టించడంతో పల్లెల ప్రగతి మడుగున పడింది. ఈ పరిస్థితిలో మార్పుతెచ్చి గ్రామాల్లో అభివృద్ధి వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేలా 'పల్లె పండగ' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. పండుగ వాతావరణంలో శంకుస్థాపనలు చేసి వచ్చే ఏడాది జనవరి నాటికి పనులు పూర్తిచేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

గ్రామ సభ నిర్ణయాలతో.. జిల్లా వ్యాప్తంగా 407 పంచాయతీల్లో సెప్టెంబరు 14న నిర్వహించిన గ్రామ సభల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రజాప్రతినిధులు, స్థానికుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. వచ్చిన వినతులు, అర్జీలపై చర్చించిన అనంతరం ప్రాధాన్య క్రమంలో కొన్ని పనులకు పాలకవర్గ సమావేశాల ద్వారా తీర్మానాలు చేశారు. వీటి ఆధారంగా జిల్లాలో 423 పనులకు ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం ఆమోద ముద్ర వేసి రూ.51.03 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులను వారం వ్యవధిలో ప్రారంభించేలా యంత్రాంగం చర్యలు చేపట్టింది.

మారనున్న రూపురేఖలు.. గత పాలకులు గ్రామాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించడంతో పల్లె రహదారులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. మురుగు పారుదల వ్యవస్థ గతి తప్పి కొద్దిపాటి వర్షానికే వీధులన్నీ జలమయమవుతున్నాయి. 'పల్లె పండగ' కార్యక్రమంలో చేపట్టే పనులతో ఇలాంటి సమస్యలకు తెరపడనుంది. తొలి దశలో రహదారులు, డ్రెయిన్ల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. కొత్తగా మంజూరైన గోకులాలు, పంట కుంటలు తదితర పనులు పట్టాలెక్కనున్నాయి. కొన్ని ప్రాంతాల్లో తాగునీరు, విద్యుత్తు పనులను కూడా చేపట్టనున్నారు.

మద్యం దుకాణాలకు 2,658 దరఖాస్తులు



భీమవరం పట్టణం, నరసాపురం, న్యూస్‌టుడే: జిల్లాలో 175 మద్యం దుకాణాలకు మంగళవారం సాయంత్రానికి 2,658 దరఖాస్తులు అందాయి. గడువు బుధవారంతో ముగియనుంది. చివరి రోజు భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశాలున్నాయని అధికారులు భావిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దరఖాస్తులు అత్యధికంగా వస్తున్నాయి. పట్టణాల్లో ఎక్కువ మద్యం దుకాణాలు కేటాయించిన చోట్ల దరఖాస్తులు తక్కువగా వచ్చాయి.

గడువు పొడిగింపు..?.. మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసే గడువును మరో రెండురోజులు పొడిగించవచ్చనే వాదనలున్నాయి. 14న లాటరీ నిర్వహించే అవకాశాలున్నాయంటున్నారు. గడువు పొడిగింపు లేకుంటే తొలుత ప్రకటించినట్లుగానే 11న లాటరీ నిర్వహిస్తారు. 12 నుంచి కొత్త దుకాణాల్లో విక్రయాలు ప్రారంభమవుతాయి.


భీమవరంలో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద

జోరువానతో జలమయం

భీమవరం పట్టణం, గునుపూడి, వీరవాసరం, న్యూస్‌టుడే: భీమవరం పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం దాదాపు 3 గంటల పాటు భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ, ఉక్కబోత వాతావరణం ఉండగా మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై జడి వాన కురిసింది. వరుసగా రెండోరోజు వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. వీరవాసరం మండలంలో పల్లపు ప్రాంతాల్లో వరిచేలలో నీరు నిలిచిపోయింది.

రైతేరాజు
సేంద్రియ సాగు.. మాధుర్యం బాగు! 14లో
ఇలా చేస్తే.. జామలో మంచి దిగుబడులే!

కాన్పులన్నీ కడుపు కోతలే..!

గణాంకాలకు ప్రసవాలకు వ్యత్యాసం

సీహెచ్‌సీలది సిజేరియన్ల బాటే

జిల్లాలో ఏ ప్రాంతాన్ని తీసుకున్నా గర్భిణుల గణాంకాలకు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో జరుగుతున్న ప్రసవాలకు పొంతన కుదరడం లేదు. సామాజిక ఆరోగ్య కేంద్రానికి పంపించినా అక్కడ కూడా సిజేరియన్లు తప్పడం లేదని బాలింతలు ఆవేదన చెందుతున్నారు. ఐసీడీఎస్ అధికారులు ఆయా సెక్టార్ల పరిధిలోని గర్భిణుల వివరాలను నమోదు చేస్తారు. ఆయా సెక్టార్లకు సంబంధించి ఉన్న పీహెచ్‌సీల్లో జరిగిన ప్రసవాలను ఐసీడీఎస్ గణాంకాలతో పోల్చితే భారీ వ్యత్యాసం కనబడుతుంది.

పాలకొల్లు, న్యూస్‌టుడే



☛ పాలకొల్లు సామాజిక ఆరోగ్య కేంద్రానికి జనవరి నుంచి సెప్టెంబర్ మధ్యలో 598 మంది గర్భిణులు కాన్పుల నిమిత్తం వచ్చారు. వీరిలో 473 మందికి సిజేరియన్లే చేయడం గమనార్హం. మొత్తం మీద కేవలం 63 మందికే సాధారణ కాన్పులు చేయగలిగారు.

☛ పెనుగొండ మండలం సిద్ధాంతం ఐసీడీఎస్ క్లస్టర్ పరిధిలో 2024 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు 131 మంది గర్భిణులుండగా ఇదే పరిధిలోని ఆరోగ్య కేంద్రంలో మొత్తం ఈ సమయంలో 15 కాన్పులు మాత్రమే జరిగాయి.

25 శాతం మించరాదు.. మొత్తం కాన్పుల్లో సిజేరియన్లు 25 శాతం మించకూడదని వైద్యఆరోగ్యశాఖ నిబంధనలు చెబుతున్నాయి. సెప్టెంబర్ నెలలో దొడ్డిపట్ల, మేడపాడు సెక్టార్లలో కలిపి 9 నెలలు నిండిన 33 మంది గర్భిణులుండగా స్థానిక పీహెచ్‌సీల్లో కేవలం అయిదు కాన్పులే జరిగాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మిగిలిన 28 మంది ప్రైవేటు బాట పట్టినవారే. వీరిలో అత్యధిక శాతం శస్త్ర చికిత్సలకు గురైనవారే. పోడూరు, యలమంచిలి, పాలకొల్లు గ్రామీణ, పాలకొల్లు పట్టణ పరిధిలో ఈ ఏడాది మొదటి 9నెలల్లో 1,594 మంది గర్భిణులకు కాన్పులవ్వగా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వచ్చినవారు కేవలం 650లోపు మాత్రమే.

అంగీకారం అవసరం.. ప్రైవేటు వైద్యులు గర్భిణుల కుటుంబ సభ్యుల నుంచి అంగీకారం కోరుతూ సంతకాలు సేకరించి కాన్పులు చేస్తున్నారు. అదే ప్రభుత్వ ఆసుపత్రులకైతే ఇటువంటి పరస్పర అంగీకార పత్రం అమలు కావడం లేదు. దీంతో ప్రభుత్వ వైద్యులు మనకెందుకొచ్చిన ఇబ్బంది అనే భావనలో ఏ మాత్రం అవకాశం ఉన్నా పై ఆసుపత్రులకు సిఫార్సు చేసి చేతులు దులుపుకొంటున్నారు. తప్పకపోతే కోతలు కోస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం దీనిపై దృష్టిసారిస్తే సిజేరియన్లు తగ్గి పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు పెరుగుతాయని పలువురు ప్రభుత్వ వైద్యులు చెబుతున్నారు.

తల్లీబిడ్డలపై ప్రభావం.. సిజేరియన్ కాన్పులతో తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. నవజాత శిశువు జన్మించిన గంటలోపు ముర్రిపాలు తాగితే ఆరోగ్యంగా ఉంటారని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. సిజేరియన్ చేయించుకున్న తల్లి కనీసం నాలుగైదు గంటల తర్వాత గాని స్పృహలోకి వచ్చే పరిస్థితి ఉండదు. సిజేరియన్ అనంతరం ఇతర ఇన్‌ఫెక్షన్లు వచ్చి బాధపడుతున్న బాలింతల కేసులు జిల్లాలో పెరుగుతున్నాయి.

దీనిపై డీఎంహెచ్‌వో మహేశ్వరరావును సంప్రదించడానికి ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

పోషణ.. అంతంతే..!

బక్కచిక్కుతున్న బాల్యం



ఈనాడు డిజిటల్, భీమవరం, తణుకు గ్రామీణం, అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న పిల్లలకు 44 రకాల వైద్య పరీక్షలు నిర్వహించగా 14,880 మంది వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్నట్లు గుర్తించారు. అత్యధికంగా రక్తహీనత, దృష్టి, వినికిడి లోపం, దంత, అభ్యాస రుగ్మత, మాట ఆలస్యం, ఐరన్‌లోపంతో ఇబ్బంది పడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. రక్తహీనత కారణంగా నీరసం, తరచూ జ్వరంతో బాధపడుతూ పాఠ్యాంశాలపై శ్రద్ధ చూపలేకపోతున్నారని, ఎముకల నొప్పులు, చిగుళ్ల వాపుతో పిల్లలు ఎక్కువగా బాధపడుతున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

☛ ఇటీవల తాడేపల్లిగూడెంలోని వసతిగృహంలో ఓ విద్యార్థిని కళ్లు తిరిగి పడిపోయింది. పోషకాహార లోపంతోనే ఈ సమస్య వచ్చిందని వైద్యులు తేల్చారు.

☛ భీమవరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న నాలుగో తరగతి విద్యార్థి కళ్లు తిరిగి పడిపోయాడు. బాలుడికి రోజూ పోషకాలతో కూడిన భోజనం అందించాలని వైద్యులు సూచించారు.


జిల్లాలో వివిధ సమస్యలతో బాధపడుతున్న పిల్లలు



దంత	3,590
దృష్టి సమస్యలు	1,795
చర్మ వ్యాధులు	916
మాట ఆలస్యం	546
అభ్యాస సమస్య	962

సమతుల ఆహారం ఇవ్వాలి.. పిల్లలకు ఇచ్చే కార్బోహైడ్రేట్లు, పిండి, కొవ్వు పదార్థాలతో పాటు, పీచు పదార్థాలు, విటమిన్లు ఉండే ఆకుకూరలు, పండ్లు, గుడ్లతో కూడిన సమతుల ఆహారం ఇవ్వాలి. ఇటీవల చిన్నారులు ఎక్కువగా చరవాణి చూస్తున్నారు. దీంతో కంటి సమస్యల బారిన పడుతున్నారు. - డాక్టర్ ప్రవీణ్, పిల్లల వైద్యాధికారిణి, భీమవరం

మత్స్యం.. నిలువెల్లా నిర్లక్ష్యం..!



నిరుపయోగంగా చేపపిల్లల పెంపకం తొట్టెలు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే : తణుకు పట్టణంలోని మత్స్యశాఖ చెరువులు సరైన నిర్వహణ లేక వెలవెలబోతున్నాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన ట్యాంకుల్లో చేపపిల్లలను పెంచి ఉత్పత్తి చేసేవారు. కాలక్రమేణా మత్స్య శాఖ వీటి నిర్వహణ పట్టించుకోలేదు. 2018లో మిషన్ ఫింగర్ లింక్స్ స్కీం పేరుతో అప్పటి ప్రభుత్వం చెరువు పూడిక తీయించి చేప పిల్లలను పెంచడం ప్రారంభించారు. రెండేళ్ల కిందట మరో సారి చెరువు తవ్వించి ఏడాది పాటు చేపపిల్లలను ఉత్పత్తి చేశారు. వర్షాలకు చేపనారు కొట్టుకుపోవడంతో నిరుపయోగంగా వదిలేశారు.

✦ తణుకులోని స్థానిక సిద్ధేశ్వర స్వామి ఆలయం ఆనుకొని ఉన్న నాలుగు నుంచి అయిదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మత్స్యశాఖ చెరువులు ఆక్రమణకు గురయ్యాయి. మత్స్యశాఖ సిబ్బంది కార్యాలయం వద్ద లేకపోవడం ఇక్కడ శాశ్వత కట్టడాలు నిర్మించారు. ''డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో సమస్య ఏర్పడింది. చెరువు చుట్టూ నీరు వెళ్లేందుకు ప్రతిపాదనలు తయారు చేశాం. జలవనరులు శాఖ అధికారులు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలి. ఆక్రమణలపై దృష్టి సారించి, సమస్య పరిష్కరిస్తాం'' అని తణుకు మత్స్యశాఖ సహాయ ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ శివ రామకృష్ణ తెలిపారు.

నేడు ఉండి ఐటీఐ స్నాతకోత్సవం

ఉండి, న్యూస్‌టుడే: ఉండిలో ప్రభుత్వ ఐటీఐ స్నాతకోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ వేగేశ్న శ్రీనివాసరాజు తెలిపారు. ఐఎంసీ ఛైర్మన్ సామంతపూడి బాలకృష్ణరాజు అధ్యక్షతన జరిగే ఈ వేడుకలో కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణరాజు, ఉన్నతాధికారులు పాల్గొని వివిధ కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తారని తెలిపారు.

స.హ. చట్టానికి జవసత్వాలు

సమస్యల పరిష్కారానికి చర్యలు


ఈనాడు డిజిటల్, భీమవరం: సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరిన దరఖాస్తుదారుడికి, సంబంధిత అప్పిలేట్ అధికారికి ఎదురయ్యే సమస్యలను వేగంగా పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా మంగళవారం గుంటూరు నుంచి నిర్వహించిన తొలి ఆన్‌లైన్ సమావేశంలో వివిధ జిల్లాలకు చెందిన 14 మంది అధికారులు, దరఖాస్తుదారులతో మాట్లాడి పలు సమస్యలు పరిష్కరించారు. దీనిలో జిల్లాకు చెందిన సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

మార్పు తెచ్చే దిశగా.. పాలనలో పారదర్శకతను పెంపొందించే లక్ష్యంతో 2005లో సమాచార హక్కు చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. రాష్ట్రంలో గత అయిదేళ్ల వైకాపా పాలనలో ఈ చట్టం అమలు తీరును అధికారులు పట్టించుకోలేదు. ఈ క్రమంలో సమాచారం కోరే వారికి వేధింపులు ఎదుర్కోవాల్సి వచ్చేది. దరఖాస్తుదారులు కోరిన సమాచారాన్ని సెక్షన్ (1) ప్రకారం 30 రోజుల వ్యవధిలో అందించాలి. ఈ నిబంధనను ఆసరాగా చేసుకొని చాలామంది అధికారులు గడువు వరకు జాప్యం చేస్తున్నారు. కొన్నిసార్లు ఉద్దేశపూర్వకంగానే సమాచారం ఇవ్వకుండా అప్పీలుకు వెళ్లిన తర్వాత స్పందిస్తున్నారు. దీంతో దరఖాస్తుదారులకు ఖర్చు, కాలయాపన తప్పడం లేదు. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. అప్పీలుకు వెళ్లాల్సి వస్తే సదరు అప్పిలేట్ అధికారి, దరఖాస్తుదారులతో ఆన్‌లైన్‌లోనే విచారణ జరిపి తక్షణం సమాచారం ఇచ్చేలా చేయడమే ఈ కార్యక్రమ లక్ష్యం.

తీరం.. వ్యర్థాలమయం..!


పేరుపాలెం బీచ్‌లో సేకరించి వదిలేసిన చెత్త మూటలు


ఏటిమొగ సమీపంలో ఇలా..


పేరుపాలెం బీచ్‌లో ఏర్పాటు చేసిన కుండీలు

ఇటీవల వరుస తుపానులు, వరదలకు ఎగువ ప్రాంతాల నుంచి కొట్టుకొచ్చిన కిక్కిస తదితర వ్యర్థాలన్నీ సముద్ర తీరంలో పేరుకుపోయాయి. ఏటిమొగ మొదలుకొని మోళ్లపర్రు బీచ్, పేరుపాలెం బీచ్, కేపీపాలెం, చినమైనవాని లంక తీరం వరకూ పలుచోట్ల పరిస్థితి ఇలాగే ఉంది. పేరుపాలెంలో కొన్నిచోట్ల వ్యర్థాలు వేసేందుకు సిమెంట్ కుండీలను ఏర్పాటు చేసినా సందర్శకులు వాటిని వినియోగించడం లేదు. ఐటీఐ గాంధీ జయంతి రోజున విద్యార్థులు సేకరించిన వ్యర్థాలను పాలిథిన్ కవర్లలో వేసి అక్కడే వదిలేశారు. అధికారులు వాటిని తొలగించి తీరంలో కూర్చునేందుకు బల్లలను, తాగు నీటిని ఏర్పాటు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

- ఈనాడు, నరసాపురం

సేంద్రియ సాగు.. మాధుర్యం బాగు!

ఆయనకు బాల్యం నుంచే వ్యవసాయమంటే మహాఆసక్తి. ఓవైపు సేంద్రియ విధానంలో పంటలు పండిస్తూ.. మరోవైపు తేనెటీగలు పెంచుతూ.. ఆదాయం ఆర్జిస్తున్నారు. ఇతర రైతులకూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు జంగారెడ్డిగూడెంకి చెందిన రైతు ముళ్లపూడి శ్రీనివాస్.

- న్యూస్‌టుడే, జంగారెడ్డిగూడెం పట్టణం

శ్రీనివాస్‌ది వ్యవసాయ కుటుంబం. పంగిడిగూడెంలో తనకున్న మూడెకరాల పొలంలో వరి, మొక్కజొన్నతో పాటు ఇతర అంతర పంటలు సాగు చేసేవారు. వర్షాధారం, చీడపీడల బాధ లేకపోతే దీర్ఘకాలిక పంటలపై దృష్టి సారించారు. పదేళ్ల కిందట పొలంలో దేశవాళీ కొబ్బరి మొక్కలు తెచ్చి నాటించారు. వాటి మధ్య అంతర పంటగా కోకో మొక్కలు పెంచారు. సాగు లాభదాయకంగా మారడంతో... జంగారెడ్డిగూడెం శివారులో మరో మూడెకరాలు కౌలుకు తీసుకున్నారు. అందులోనూ కొబ్బరి, కోకోను సాగు చేస్తున్నారు. ఖర్చులన్నీ పోను ఏడాదికి ఎకరాకు రూ.2.70 లక్షలు ఆదాయం పొందుతున్నారు.

వినూత్న పంథాలో... వ్యవసాయంతో పాటు వినూత్నంగా ఏదైనా చేయాలని శ్రీనివాస్ భావించేవారు. అయిదేళ్ల క్రితం పెదవేగి మండలం విజయరాయిలోని కేవీకేలో తేనెటీగల సాగుపై వారం రోజులు శిక్షణ తీసుకున్నారు. శిక్షణానంతరం 5 తేనెటీగల పెట్టెలు, యూరోపియన్ తేనెటీగలు తీసుకొచ్చి... కోకో, కొబ్బరి తోటలో ప్రయోగాత్మకంగా పెంచారు. ప్రస్తుతం 150కు పైగా పెట్టెలుండగా నెలకు సుమారు 300 కిలోల తేనె ఉత్పత్తి చేస్తున్నారు.

సంప్రదాయ సస్యరక్షణ

శ్రీనివాస్‌కు మొదట్నుంచి సేంద్రియ వ్యవసాయమే బలం. రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందుల వాడకానికి ఆయన దూరం. సంప్రదాయ సస్యరక్షణ చర్యలు పాటిస్తూ... సేంద్రియ పద్ధతుల్లో పంటలు పండిస్తున్నారు. పశువుల ఎరువు, జీవామృతం, కోకో చెట్ల నుంచి వచ్చే ఎండు ఆకుల తదితరాలను మొక్కల మొదళ్లలో వేస్తూ.. నీరందిస్తున్నారు. పొలంలో వర్షపునీరు నిల్వ ఉండేలా ఐదడుగుల గుంతలు తవ్వుకున్నారు. 'వ్యవసాయం అంటే చిన్నతనం నుంచే ఇష్టం. ఆ మక్కువతోనే ముందుకెళ్తున్నా. ఎకరాకు కోకో, కొబ్బరిపై ఖర్చులన్నీ పోను రూ.1.50 లక్షలు, తేనె విక్రయంపై ఏడాదికి రూ.1.20 లక్షలు ఆదాయం పొందుతున్నా' అని రైతు ముళ్లపూడి శ్రీనివాస్ తెలిపారు.


తేనెటీగల పెట్టెలు పరిశీలిస్తున్న రైతు శ్రీనివాస్

రైతేరాజు

దోమ ఆశిస్తే.. అప్రమత్తం కావాల్సిందే

ఆచంట (మార్టేరు), న్యూస్‌టుడే: వరి పంటను దోమ ఆశిస్తే తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని లేని పక్షంలో దిగుబడిపై ప్రభావం పడుతుందని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో పంటను దోమ ఆశించిన నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యల గురించి ఆయన వివరించారు. వరి దుబ్బుకు 20-25 దోమలు ఉన్నట్లయితే వెంటనే అప్రమత్తమై సస్యరక్షణ చర్యలకు వెళ్లాలి. పొలాన్ని ఆరబెట్టాలి. డైనోటెఫ్యూరాన్ 0.4 గ్రాములు లేదంటే పైమెట్రోజిన్ 0.6 గ్రాములు లేదా ట్రైఫ్లూమిజోపైరిమ్ 0.48 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి కలిపి ఏదైనా ఒక పురుగు మందును మొక్క మొదలు తడిచేటట్లుగా పిచికారీ చేయాలి. రెండోసారి పిచికారీ చేయాల్సి వచ్చినపుడు మొదట వాడిన మందులను కాకుండా మార్చి వాడాలి. ముఖ్యంగా దోమ ఉధృతిని పెంచే పురుగు మందులను ఎట్టి పరిస్థితుల్లో వాడరాదని సూచించారు.


పంటను ఆశించిన దోమ

మీరూ అడగొచ్చు

ప్రశ్న: సపోటాలో కాయ తొలుచు పురుగు ఎలా అరికట్టాలి? - రామచంద్రరావు, దెందులూరు

సమాధానం: గుడ్డు నుంచి వెలువడిన గొంగళి పురుగులు కాయ లోపలికి తొలిచి గుజ్జును తిని పురుగు విసర్జితాలతో రంధ్రం మూసి ఉంటుంది. పూర్తిగా పెరిగిన గొంగళి పురుగు కాయ నుంచి వెలువడి కోశస్థ దశను గడుపుతుంది. తర్వాత దశలో శలభం ఆశించడం వల్ల కాయలు కుళ్లిపోతాయి. దీని నివారణకు వేప గింజల కషాయం 5 శాతం లేదా వేప నూనె 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి లేత చిగురు, పూత దశలో కాయ కోసే సమయంలో మందులు మార్చి మార్చి పిచికారీ చేయాలి.


డాక్టర్ ఇకుఱుశ్రీ, ప్రధాన శాస్త్రవేత్త కృషి విజ్ఞాన కేంద్రం, వెంకట్రామన్నగూడెం

ఉద్యాన విశ్వవిద్యాలయం న్యూస్‌టుడే

✆ చరవాణి 73826 33692

ఇలా చేస్తే.. జామలో మంచి దిగుబడులే



పోడూరు, న్యూస్‌టుడే: జామ తోటల్లో సమగ్ర ఎరువులు, పోషకాల యాజమాన్యంతో నాణ్యమైన దిగుబడిని పొందవచ్చని తణుకు ఉద్యానశాఖాధికారి ప్రియదర్శిని తెలిపారు. ఈ సాగులో ఎరువులు, పోషకాల యాజమాన్యంపై ఆమె పలు విషయాలు వివరించారు. ఏడాది వయసు కలిగిన జామ చెట్టుకు 200 గ్రాముల యూరియా, 250 గ్రాముల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 100 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి. రెండు నుంచి మూడు సంవత్సరాల వయసు కలిగిన చెట్లకు 400 గ్రాముల యూరియా, 500 గ్రాముల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 350 గ్రాములు మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి. నాలుగో సంవత్సరం నుంచి 850 గ్రాముల యూరియా, కేజీ సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 850 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి. ఈ మోతాదులను ఏప్రిల్-జూన్ నెలలో 50 శాతం, అక్టోబర్-నవంబరు నెలలో మరో 50 శాతం వేయాలి. వీటితోపాటు ఏటా కనీసం 10 నుంచి 15 కిలోల పశువుల ఎరువు, 2 నుంచి 5 కిలోల వేప పిండి తప్పని సరిగా వేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు.

బ్యూటీ పార్లర్ నిర్వాహకురాలి ఆత్మహత్య

ఆచంట(మార్టేరు), న్యూస్‌టుడే: అప్పులపాలైన బ్యూటీ పార్లర్ నిర్వాహకురాలు మనస్తాపానికి గురై మంగళవారం బలవన్మరణానికి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఆచంట వేమవరం గ్రామానికి చెందిన షేక్ రజీయా(33) ఇంట్లో పంకాకు చీర కట్టి ఉరి వేసుకున్నారు. కుటుంబ సభ్యులు గుర్తించినప్పటికే ఆమె మృతి చెందారు. ఈమె స్థానికంగానే బ్యూటీ పార్లర్ నిర్వహిస్తూ జీవిస్తున్నారు. దీని కోసం పలు చోట్ల చీటీలు కట్టి, అప్పులు తీసుకున్నారు. పార్లర్ సరిగా నడవక పోవడం, అప్పు పెరగడంతో అవి ఎలా తీరతాయో తెలియని పరిస్థితుల్లో క్షణికావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. మృతురాలి భర్త షైలర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటరమణ తెలిపారు. ఈమెకు కుమార్తె, కుమారుడు ఉన్నారు.


చికిత్స పొందుతున్న బాధితుడు

ఇద్దరిపై తేనెటీగల దాడి

పాలకొల్లు మార్కెట్, పోడూరు న్యూస్‌టుడే: పొలం వద్ద పని చేస్తున్న క్రమంలో ఇద్దరిపై మంగళవారం తేనెటీగలు దాడి చేశాయి. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళ్తే.. కవిటం గ్రామానికి చెందిన ఇళ్ల నాగేశ్వరరావుకు మట్టపర్రులో ఉన్న పొలంలో స్థానికుడైన కె.రాంపండు సాయంతో క్రిమిసంహారక మందు పిచికారీ చేశారు. అనంతరం కొబ్బరికాయలపై కప్పిన బరకాన్ని తొలగించే ప్రయత్నం చేశారు. ఈ బరకంపై ఉన్న తేనెపట్టును వీరు గమనించక పోవడంతో ఒక్కసారిగా తేనెటీగలు విరుచుకుపడ్డాయి. రాంపండుకు తల పైభాగంలో నాగేశ్వరరావు ఇతర శరీర భాగాలపై కట్టాయి. వీరికి స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స చేయించి అక్కడి నుంచి పాలకొల్లు ఆసుపత్రికి తీసుకెళ్లారు.

బడి జట్టు.. అదిరేట్టు!

హ్యాండ్‌బాల్ రాష్ట్ర పోటీలకు ఎంపిక

పాలకోడేరు, న్యూస్‌టుడే

పాలకోడేరు మండలం మోగల్లు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల జరిగిన స్కూల్‌గేమ్స్ మండల, నియోజకవర్గ, డివిజన్, జిల్లా స్థాయి పోటీల్లో సత్తాచాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. హ్యాండ్ బాల్ అండర్-14, 17 విభాగాల్లో ఈ పాఠశాలకు చెందిన ముగ్గురు బాలికల జట్టుకు, నలుగురు బాలుర జట్టుకు ఎంపికయ్యారు. దసరా సెలవుల అనంతరం జరిగే రాష్ట్ర స్థాయి పోటీల కోసం వ్యాయామ ఉపాధ్యాయుడు రాంబాబు ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న వీరు తమ భవిష్యత్తు లక్ష్యాలను ఇలా వివరించారు.


ఎంపికైన విద్యార్థులు

సత్తా చాటుతాం



''గతేడాది అండర్-14 విభాగంలో హ్యాండ్ బాల్ జిల్లా జట్టు తరఫున గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నా. గతం కంటే మెరుగైన ప్రతిభ చూపాలనే లక్ష్యంతో ప్రస్తుతం సాధన చేస్తున్నా. ఈ కచ్చితంగా విజయం సాధిస్తాం.''

- ఆర్.మానస

చక్కటి ప్రోత్సాహం



''దాతల సహకారంతో మా పాఠశాల మైదానాన్ని అభివృద్ధి చేసి హ్యాండ్ బాల్ కోర్టును ఏర్పాటు చేయడంతో సాధనకు అనుకూలంగా ఉంది. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో నిత్యం సాధన కొనసాగిస్తున్నాం. ఈ సారి రాష్ట్ర స్థాయి పోటీల్లో కచ్చితంగా విజయం సాధిస్తామనే నమ్మకం ఉంది.''

- ఎం.నాగేంద్రబాబు

కొత్త మెలకువలతో..



''గతేడాది విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొని మెరుగైన ప్రతిభ చూపా. ఈ సారి విజయం సాధించాలనే లక్ష్యంతో కొత్త మెలకువలపై ఉదయం, సాయంత్రం వేళ సాధన చేస్తున్నా.''

- పి.తరుణ్

గుర్తింపు కోసం..



''గతేడాది కూడా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈసారి విజయం సాధించి పాఠశాలకు, జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో కఠోర సాధన చేస్తున్నాం. పీడీ సూచనలు, సలహాలు పాటిస్తూ కొత్త మెలకువలు నేర్చుకుంటున్నాం.'

- ఎం.హర్షిత దుర్గ

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

రూ.3 లక్షల సొత్తు స్వాధీనం

పాలకోడేరు, న్యూస్‌టుడే: పలు జిల్లాల్లో వరుస చోరీలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేసినట్లు భీమవరం రూరల్ సీఐ బి.శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. తూర్పుగోదావరి జిల్లా చాగల్లు గ్రామానికి చెందిన డొక్కు సాయికిరణ్ జల్సాల కోసం చోరీలకు పాల్పడుతున్నాడు. జిల్లాలో పాలకోడేరు, ఉండి, పాలకొల్లు రూరల్ పోలీస్‌స్టేషన్లలో అతడిపై చోరీ కేసులు నమోదయ్యాయి. అతడి కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు గొల్లలకోడేరు వద్ద మంగళవారం అరెస్టు చేశారు. చోరీ చేసిన సొత్తును ఆకివీడు మండలం గుమ్ములూరుకు చెందిన మండా రాజేశ్‌కు ఇస్తున్నట్లు గుర్తించి అతడ్ని కూడా అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 3 లక్షల విలువైన కెమెరాలు, ల్యాప్‌టాప్‌లు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. వీరిని భీమవరం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండు విధించినట్లు తెలిపారు.


విరాళం చెక్కులను ఎమ్మెల్యేకు అందజేస్తున్న డీఎన్నార్ పాలకవర్గం, ఉపాధ్యాయులు

వరద బాధితులకు చేయూత

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: విజయవాడలో వరద బాధితుల సహాయార్థం భీమవరం డీఎన్నార్ విద్యా సంస్థల తరఫున రూ.2.59 లక్షల విరాళం ఇచ్చారు. దీనికి సంబంధించిన చెక్కులను డీఎన్నార్ పాలకవర్గ కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు, ఉపాధ్యక్షుడు జి.పాండురంగ రాజు, సంయుక్త కార్యదర్శి కూనపరాజు రామకృష్ణరాజు, పరిపాలన విభాగాధికారి పి.రామకృష్ణంరాజు, ప్రధానోపాధ్యాయులు సీహెచ్ నిర్మల, బి.శ్రీనివాసరావు తదితరులు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులుకు మంగళవారం అందజేశారు.

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: పాలకోడేరు మండల పరిధిలో పంచాయతీ రాజ్ శాఖ, గ్రామ సచివాలయాల సిబ్బంది రూ.56 వేల విరాళం అందించారు. ఈ మేరకు చెక్కును భీమవరం ఎంపీడీవో మురళీ గంగాధర రావు మంగవారం కలెక్టర్ నాగ రాణికి అందజేశారు.

డిగ్రీ ప్రవేశాలకు కౌన్సెలింగ్


ధ్రువపత్రాలు అందిస్తున్న వీసీ గోపాల్

ఉద్యాన విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలల్లో ఉత్తీర్ణత సాధించి హార్టీ సెట్-2024 అర్హత పొందిన విద్యార్థులకు బీఎస్సీ (హార్టీకల్చర్) కోర్సులో ప్రవేశాలకు స్థానిక వర్సిటీ పరిపాలన భవనంలో మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 91 సీట్లు అందుబాటులో ఉన్నాయని, హార్టీ సెట్-2024లో 255 మంది అర్హత పొందగా కౌన్సెలింగ్‌కి 169 మంది హాజరైనట్లు రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు తెలిపారు.

ధనలక్ష్మీ రూపం.. స్వర్ణ కిరీటంతో రాజసం

నిడమర్రు, న్యూస్‌టుడే: మందలపర్రులో ఉమా నీలకంఠేశ్వరస్వామి క్షేత్రంలో అమ్మవారికి గ్రామస్థుల విరాళాలు రూ.42 లక్షలతో తయారు చేయించిన 500 గ్రాముల బంగారు కిరీటాన్ని మంగళవారం అలంకరించారు. తొలుత అమ్మవారికి స్థానికులు టన్నున్నర సారె, స్వర్ణ కిరీటాన్ని గ్రామ దేవత జమ్ములమ్మ ఆలయానికి తీసుకెళ్లి... అక్కణ్నుంచి ప్రదర్శనగా పంచాయతన క్షేత్రానికి తీసుకొచ్చారు. అక్కడ కిరీటానికి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి అలంకరించారు. ఆపై రూ.50 లక్షల నగదుతో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా మహిళలు కుంకుమార్చన పూజలు చేశారు. అమ్మవారిని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ నిర్వాహకులు వెంకట సుబ్బరాజు, శంకరం, కె.రామచంద్రరాజు, పి.కృష్ణంరాజు తదితరులు పర్యవేక్షించారు.


మందలపర్రులో అమ్మవారు

శిక్షణ సంస్థల ఎంపికకు దరఖాస్తులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ ఇచ్చే సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డు కులాల సాధికారిత అధికారి కె.శోభారాణి తెలిపారు. దరఖాస్తుకు ఈ నెల 21వ తేదీ వరకు వరకు గడువు ఉందన్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.25 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

భీమవరం

విధుల్లో చేరిన ఉప తహసీల్దారు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: భీమవరం ఉప తహసీల్దారుగా నాగార్జున మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో కాళ్ల మండలంలో పని చేసిన ఆయన ఇక్కడకి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

15 నుంచి గ్రామ సభలు

పాలకోడేరు, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు రీసర్వేపై గ్రామ సభలు నిర్వహించనున్నట్లు పాలకోడేరు తహసీల్దారు ఎన్‌బీ విజయలక్ష్మి తెలిపారు. భూములకు సంబంధించిన సమస్యలను సభ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

దిర్సుమర్రు (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: భీమవరం మండలం దిర్సుమర్రులో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బాలికలు, మహిళల రక్షణ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని వక్తలు సూచించారు. భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు న్యూటన్, ప్యానల్ న్యాయవాదులు సుధీర్, అంబేడ్కర్, రవికిరణ్, గంగాభవానీ, సర్పంచి కోళ్ల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యూటన్

స్తంభాలపై పాదుల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

కాళ్ల, న్యూస్‌టుడే: కాళ్ల మండలంలో ప్రధాన రహదారి వెంబడి పలు గ్రామాల్లో 11 కేవీ విద్యుత్తు లైన్లు, స్తంభాలకు పాదులు అల్లుకుని ప్రమాదకంగా మారిన తీరుపై 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికతో ఈ నెల 7న ప్రచురితమైన కథనానికి ఆ శాఖ ఏఈ రాంబాబు స్పందించారు. స్తంభాలపై పాదులు తొగింపు పనులు మంగళవారం చేయించారు.

లయన్స్‌క్లబ్ సేవా దినోత్సవం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రూ.52 లక్షలతో లయన్స్ విజన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆ క్లబ్ గ్లోబల్ సమన్వయకర్త సీహెచ్ కృష్ణంరాజు చెప్పారు. లయన్స్‌క్లబ్ సేవా దినోత్సవాన్ని పీఎస్ఎం బాలికోన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ వబిలిశెట్టి కనకరాజును సన్మానించారు. ఆయన సహకారంతో 8 పంకాలను పాఠశాలకు అందజేశారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పేరిచర్ల మూర్తిరాజు, జి.మురళీకృష్ణ, కోశాధికారి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర దుకాణంలో చోరీ

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడులోని పొట్టి శ్రీరాములు విగ్రహం కూడలి వద్ద ఉన్న వస్త్ర దుకాణంలో మంగళవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తి దుకాణం తలుపులు పగులగొట్టి లోనికి చొరబడి నగదు అపహరించాడు. దీనికి సంబంధించి సీసీ ఫుటేజీలో నమోదైన దృశ్యాలను పోలీసులు పరిశీలించారు.



సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్న పోలీసులు

ఊడ్చేసిన వరద!

ఛిద్రమైన అనుసంధాన రహదారులు



ఆకివీడు: రాళ్లు తేలిన సమతానగర్ రోడ్డు

ఆకివీడు, ఉండి, న్యూస్‌టుడే: భారీ వర్షాలు, కొల్లేరు వరద ప్రభావంతో పలు ప్రాంతాల్లో రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఉండి నియోజకవర్గ పరిధిలో పలు మండలాలు, గ్రామాలను అనుసంధానం చేసే రహదారులు రాళ్లు తేలి దారుణంగా మారాయి. రోజుల తరబడి ముంపులో ఉండటంతో పైపొర కొట్టుకుపోవడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఇలాంటి మార్గాల్లో రాకపోకలకు వాహనచోదకులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఆకివీడు మండల పరిధిలో సమతానగర్, గుమ్ములూరు- అప్పారావుపేట, చినకాపవరం- రామయ్యగూడెం, సిద్ధాపురం- చినమిల్లిపాడు రహదారులతో పాటు నిర్మాణం మధ్యలో నిలిచిన పెదకాపవరం- క్రొవ్విడి, పెదకాపవరం- పాములపర్రు మార్గాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వరద ప్రభావంతో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

చినుకుపడితే మడుగే..!

చినుకు పడితే చాలు ఉండిలో పల్లపు ప్రాంతాలు మడుగుల్లా మారిపోతున్నాయి. సోమ, మంగళవారాల్లో కురిసిన వర్షాలకు కొండ్రొతుపేట, కాపులపేట, మార్కెట్ ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండ్రొతుపేటలో జంగాలుల కాలనీకి వెళ్లే మార్గంలో మురుగు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లో మట్టి, వ్యర్థాల తొలగింపు పనులు సక్రమంగా చేపట్టకపోవడమే దీనికి కారణమని ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై ఉండి ఈవోపీఆర్డీ రామకృష్ణారెడ్డి స్పందిస్తూ మురుగు పారుదల వ్యవస్థను మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కొండ్రొతుపేటలో సీసీ రహదారిపై నిలిచిన నీరు

ధరలు నియంత్రించాలని ధర్నా

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: నిత్యావసర సరకుల ధరలను నియంత్రించాలని సీఐటీయూ పట్టణ నాయకుడు ఎం. వైకుంఠరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్సార్ కాలనీలో సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. వైకుంఠరావు మాట్లాడుతూ ఉల్లిపాయలు, టమాటా ధరలు పోటీపడి పెరుగుతున్నాయన్నారు. ఇసుక కొరత కారణంగా నిర్మాణ రంగ కార్మికులు ఉపాధి లేక అవస్థలు పడుతున్న సమయంలో నిత్యావసర ధరలు మరింత భారంగా మారాయన్నారు. సీపీఎం నాయకులు డి. త్రిమూర్తులు, ఎం. మంగ, కె.అరుణ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని సామ్‌సంగ్ షోరూం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్వీ గోపాలన్ మాట్లాడుతూ కార్మిక యూనియన్ ఏర్పాటుకు సదరు సంస్థ నిరాకరించడం కార్మిక చట్టాలను ఉల్లంఘించడమేనన్నారు.

పల్లెల సమగ్ర అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న డీపీవో అరుణశ్రీ, పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చినఅమిరం (భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: పల్లెల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారిణి అరుణశ్రీ సూచించారు. భీమవరం డివిజన్ పరిధిలో పంచాయతీల ప్రజాప్రతినిధులు, అధికారులకు చినఅమిరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల సమావేశ మందిరంలో మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామాల వారీగా ప్రజలకు అత్యవసరమైన సౌకర్యాలను ప్రాధాన్య క్రమంలో గుర్తించి ఆయా పనులు చేపట్టేలా దృష్టి సారించాలన్నారు. అన్ని గ్రామాల్లో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను వినియోగంలోకి తేవాలని స్పష్టం చేశారు. పంచాయతీ కార్యదర్శులు నిబంధనలకు లోబడి పని చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు.

పాలకోడేరు, వీరవాసరం, ఉండి, ఆకివీడు, న్యూస్‌టుడే: రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ వార్షిక కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనపై పాలకోడేరు, వీరవాసరం, ఉండి, ఆకివీడు మండలాల్లో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు.

మెరుగైన సేవలే లక్ష్యం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలోని సప్తనిధి లిమిటెడ్ క్వాజీ బ్యాంకింగ్ శాఖ 5వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన ప్రముఖులు, ఖాతాదారులను సంస్థ తరపున సన్మానించారు. సీఈవో కొల్లి స్వామినాయుడు మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, సంస్థ తరపున సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, ఖాతాదారులు



సమావేశంలో దళిత సంఘాల నాయకులు, స్థానికులు

వైకాపా ఎంపీటీసీ సభ్యుడిపై ఫిర్యాదు

పాలకోడేరు, న్యూస్‌టుడే: దళితుల శ్మశానవాటిక స్థలాన్ని ఆక్రమించడమే కాకుండా మతాలు, కులాల మధ్య విద్వేషాలు రెచ్చకొట్టేలా తప్పుడు ఫిర్యాదులు చేస్తున్న గరగపర్రుకు చెందిన వైకాపా ఎంపీటీసీ సభ్యుడు షేక్ పాపా సాహెబ్‌పై చర్యలు తీసుకోవాలని స్థానిక దళిత నాయకులు సత్యాల జీవరత్నం, కొనాల ఎలీషారావు తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు భీమవరం రూరల్ సీఐకు ఫిర్యాదు చేశారు. మంగళవారం గరగపర్రులో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నాయకులు ఈ వివరాలు మాట్లాడారు. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ స్థలమని పంచాయతీ అధికారులతో బోర్డు పెట్టించి, ఇప్పుడు అదే స్థలాన్ని సదరు ఎంపీటీసీ సభ్యుడు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. అతడిని అరెస్టు చేయడంతో పాటు శ్మశాన స్థలాన్ని తమకు అప్పగించి న్యాయం చేయాలని కోరారు.

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక బృందాలు

డయల్ యువర్ కమిషనర్‌కు విశేష స్పందన



సమస్యలు వింటున్న కమిషనర్ రామచంద్రారెడ్డి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని.. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ, కాలువల్లో పూడిక తీత పనులకు ప్రత్యేక బృందాలను నియమిస్తామని పురపాలక కమిషనర్ కె.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. పలు వార్డుల ప్రజలు ఆయా ప్రాంతాల్లో సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై కమిషనర్ స్పందించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి.

సమస్య: రెస్ట్‌హౌస్ రోడ్డు ప్రాంతంలో మురుగు కాలువలు పూడికపోయి మురుగు నిలిచిపోతోంది. వర్షాలు కురిసినప్పుడు రోడ్లపై నీరు నిలిచి ఇళ్లలోకి వెళ్లే దారి కూడా ఉండటం లేదు. బ్యాంకు కాలనీలోని పలు వీధుల్లో ముంపు తప్పడంలేదు. - జి.రమణ, ఎం.నాగబాబు, రవిశంకర్, కృష్ణమోహన్

సమాధానం: ప్రతి వార్డులో ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలు చేయిస్తున్నాం.

● కార్యక్రమం అనంతరం కమిషనర్ ఈ ఫోన్‌ఇన్‌ సందర్భంలో డ్రెయిన్లను శుభ్రం చేయించి, చెత్త తొలగింపజేయించారు.

సమస్య: అంబేడ్కర్ కూడలి, బుధవారం మార్కెట్, మూడో వార్డు, మెంటేవారితోట, గునుపూడి నుంచి ఎస్‌సీఐ గోడౌను వెళ్లే మార్గాల్లో ఉన్న డ్రైన్లు దెబ్బతినడంతో మురుగు నిలిచి వాహనాలు జారిపోతున్నాయి. - ఎం.రాంబాబు, కె.శ్రీధర్, చందు, మూర్తి

సమాధానం: పరిశీలించి శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడతాం.

సమస్య: 27వ వార్డులో పతివాడవారి వీధి, జువ్వలపాలెం రోడ్డు నుంచి సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి వెళ్లే మార్గాల్లో డ్రెయిన్లను శుభ్రం చేయడంలేదు. దీనిపై ప్రశ్నిస్తే సిబ్బంది దురుసుగా వ్యవహరిస్తున్నారు. - వెన్నేటి రామకృష్ణరాజు, విజ్జురోతు గణపతి, పాండురంగారావు, వెంకటేష్, జగన్మోహనరావు, కె.గోపి, ఎం.సత్యనారాయణ

సమాధానం: చెత్త సేకరణ, డ్రెయిన్ల శుభ్రత పనులపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తాం. ఈ పనులపై రోజూ వార్డుల్లో పరిశీలన చేస్తున్నాం.

సమస్య: శ్రీకృష్ణదేవరాయలు కల్యాణమండపం వీధి, బ్యాంకుకాలనీ, గునుపూడి, నర్సయ్యఅగ్రహారాల్లో వీధి దీపాలు వెలగడంలేదు. కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ముత్యాలసిబ్బ ప్రాంతంలో ఖాళీస్థలాల్లో పందులు ఉన్నాయి. - బి.శ్రీనాథ్, జి.గణ, దుర్గాప్రసాద్, వి.నరసింహమూర్తి, డి.సురేష్

సమాధానం: కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేసే కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకొస్తాం. పందులు పట్టణంలోకి రాకుండా పెంపకందారులకు ఆదేశాలిస్తాం. వీధిదీపాల మరమ్మతులు ఎప్పటికప్పుడు జరిగేలా చర్యలు తీసుకుంటాం.

చెత్త సేకరణలో నిర్లక్ష్యం

సమస్య: వినయగనిపాలెం, పారిశ్రామికవాడ, రెడ్డికాలనీ, శ్రీరామపురం ప్రాంతాల్లో ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా లేదు. వాహనం ఎప్పుడొస్తుందో తెలియడంలేదు. - సూరిబాబు, రాజా, శ్రీనాథ్, రామ్‌కుమార్

సమాధానం: చెత్తను ఎప్పటికప్పుడు తరలింపజేయిస్తాం. పర్యవేక్షణకు బృందాలు ఏర్పాటు చేశాం. ఎప్పుడైనా వాహనాలు రాకపోతే నేరుగా ఫిర్యాదు చేయండి.. తక్షణం పరిష్కరిస్తాం.



రెస్ట్‌హౌస్ రోడ్డులో వ్యర్థాల తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్

కుళాయిలు బిగించలేదు

సమస్య: బ్యాంకుకాలనీ, లంకపేట, దుర్గాపురం, గునుపూడి ప్రాంతాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షను ఇప్పటికీ ఇవ్వలేదు. దుర్గాపురంలో రంగనాథుని నీరు వస్తోంది. - రాజేంద్రకుమార్, రవిమోహన్, బి.శ్రీను, విజయలక్ష్మి, శ్రుతి, శ్యాంకుమార్

సమాధానం: కొత్త పైపులైన్లకు ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు చెప్పారు. పరిశీలించి పనులు పూర్తి చేయిస్తాం.

నేడు ఉండి ఐటీఐ స్నాతకోత్సవం

ఉండి, న్యూస్‌టుడే: ఉండిలో ప్రభుత్వ ఐటీఐ స్నాతకోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ వేగేశ్న శ్రీనివాసరాజు తెలిపారు. ఏఎంసీ ఛైర్మన్ సామంతపూడి బాలకృష్ణంరాజు అధ్యక్షతన జరిగే ఈ వేడుకలో కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు, ఉన్నతాధికారులు పాల్గొని వివిధ కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తారని తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి భీమవరం పట్టణానికి చెందిన వేంద్ర రమేష్‌కుమార్ మంగళవారం రూ. 2,02,232 విరాళం అందజేశారు. వీరికి స్వామివారి జ్ఞాపిక అందించి దేవస్థానం పర్యవేక్షకుడు పులపర్తి రాంబాబు అభినందించారు.



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ పర్యవేక్షకుడు రాంబాబు

స.హ. చట్టానికి జవసత్వాలు

సమస్యల పరిష్కారానికి చర్యలు

ఈనాడు డిజిటల్, భీమవరం: సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరిన దరఖాస్తుదారుడికి, సంబంధిత అప్పిలేట్ అధికారికి ఎదురయ్యే సమస్యలను వేగంగా పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా మంగళవారం గుంటూరు నుంచి నిర్వహించిన తొలి ఆన్‌లైన్ సమావేశంలో వివిధ జిల్లాలకు చెందిన 14 మంది అధికారులు, దరఖాస్తుదారులతో మాట్లాడి పలు సమస్యలు పరిష్కరించారు. దీనిలో జిల్లాకు చెందిన సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

మార్పు తెచ్చే దిశగా.. పాలనలో పారదర్శకతను పెంపొందించే లక్ష్యంతో 2005లో సమాచార హక్కు చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. రాష్ట్రంలో గత అయిదేళ్ల వైకాపా పాలనలో ఈ చట్టం అమలు తీరును అధికారులు పట్టించుకోలేదు. ఈ క్రమంలో సమాచారం కోరే వారికి వేధింపులు ఎదురయ్యేవి వచ్చేవి. దరఖాస్తుదారులు కోరిన సమాచారాన్ని సెక్షన్ (1) ప్రకారం 30 రోజుల వ్యవధిలో అందించాలి. ఈ నిబంధనలను అనుసరించకుండా చాలామంది అధికారులు గడువు వరకు జాప్యం చేస్తున్నారు. కొన్నిసార్లు ఉద్దేశపూర్వకంగానే సమాచారం ఇవ్వకుండా అప్పీలుకు వెళ్లిన తర్వాత స్పందిస్తున్నారు. దీంతో దరఖాస్తుదారులు ఇబ్బంది, కాలయాపన తప్పడం లేదు. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. అప్పీలుకు వెళ్లాల్సి వస్తే సదరు అప్పిలేట్ అధికారి, దరఖాస్తుదారులతో ఆన్‌లైన్‌లోనే విచారణ జరిపి తక్షణం సమాచారం ఇచ్చేలా చేయడమే ఈ కార్యక్రమ లక్ష్యం.

సేంద్రియ సాగు.. మాధుర్యం బాగు!

శ్రీనివాస్‌ది వ్యవసాయ కుటుంబం. మండిగూడెంలో తనకున్న మూడెకరాల పొలంలో వరి, మొక్కజొన్నతో పాటు ఇతర అంతర పంటలు సాగు చేసేవారు. వర్షాభావం, గిట్టుబాటు ధరల లేమితో దీర్ఘకాలిక పంటలపై దృష్టి సారించారు. పదేళ్ల కిందట పొలంలో దేశవాళీ కొబ్బరి మొక్కలు తెప్పించి నాటించారు. వాటి మధ్య అంతర పంటగా కోకో మొక్కలు పెంచారు. సాగు లాభదాయకంగా మారడంతో.. జంగారెడ్డిగూడెం శివారులో మరో మూడెకరాలు కౌలుకు తీసుకుని.. అందులోనూ కొబ్బరి, కోకోను సాగు చేస్తున్నారు. ఖర్చులన్నీ పోను ఏటా ఎకరాకు రూ.2.70 లక్షలు ఆదాయం పొందుతున్నారు.

ఆయనకు బాల్యం నుంచే వ్యవసాయమంటే అమితాసక్తి. ఓవైపు సేంద్రియ విధానంలో పంటలు పండిస్తూ.. మరోవైపు తేనెటీగలు పెంచుతూ.. ఆదాయం ఆర్జిస్తున్నారు ఇతర రైతులకూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు జంగారెడ్డిగూడెంకి చెందిన ముళ్లపూడి శ్రీనివాస్. - న్యూస్‌టుడే, జంగారెడ్డిగూడెం పట్టణం

వినూత్న పంథాలో.. వ్యవసాయంతో పాటు వినూత్నంగా ఏదైనా చేయాలని శ్రీనివాస్ భావించేవారు. అయిదేళ్ల క్రితం విజయవాడలోని కేవీకేలో తేనెటీగల పెంపకంపై అవగాహన పొందారు. శిక్షణ పొంది.. అనంతరం 5 తేనెటీగల పెట్టెలు, యూరోపియన్ తేనెటీగలు తీసుకొచ్చి.. కోకో, కొబ్బరి తోటలో ప్రయోగాత్మకంగా పెంచారు. ప్రస్తుతం 150కు పైగా పెట్టెలు ఉన్నాయి. నెలకు సుమారు 900 కిలోల తేనె ఉత్పత్తి చేస్తున్నారు.



తేనెటీగల పెట్టెలు పరిశీలిస్తున్న రైతు శ్రీనివాస్

సంప్రదాయ సస్యరక్షణ

శ్రీనివాస్‌కు మొదట్నుంచి సేంద్రియ వ్యవసాయమే ఇష్టం. రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకానికి ఆయన దూరం. సంప్రదాయ సస్యరక్షణ చర్యలు పాటిస్తూ.. సేంద్రియ పద్ధతుల్లో పంటలు పండిస్తున్నారు. పశువుల ఎరువు, జీవామృతం, కోకో చెట్ల నుంచి వచ్చే ఎండు ఆకుల తదితరాలను మొక్కల మొదళ్లలో వేస్తూ.. సేంద్రియ ఎరువుగా వాడుతున్నారు. పొలంలో వర్షపునీరు నిల్వ ఉండేలా ఇంకుడు గుంతలు తవ్వుకున్నారు. 'వ్యవసాయం అంటే చిన్ననాటి నుంచే ఇష్టం. ఆ ఆసక్తితోనే ముందుకెళ్తున్నా. ఎకరాకు కోకో, కొబ్బరిపై ఖర్చులన్నీ పోను రూ.1.50 లక్షలు, తేనె విక్రయంపై ఏడాదికి రూ.1.20 లక్షలు ఆదాయం వస్తోంద'ని అని రైతు ముళ్లపూడి శ్రీనివాస్ తెలిపారు.

రైతేరాజు

దోమ ఆశిస్తే.. అప్రమత్తం కావాల్సిందే

ఆచంట (మార్టేరు), న్యూస్‌టుడే: వరి పంటను దోమ ఆశిస్తే తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో దిగుబడిపై ప్రభావం పడుతుందని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో పంటను దోమ ఆశించిన నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యల గురించి ఆయన వివరించారు. వరి దుబ్బుకు 20-25 దోమలు ఉన్నట్లయితే వెంటనే అప్రమత్తమై సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. పొలాన్ని అడపాదడపా ఆరబెట్టాలి. డైనోటెఫ్యూరాన్ 0.4 గ్రాములు లేదంటే పైమెట్రోజిన్ 0.6 గ్రాములు లేదా ట్రైఫ్లూమిజోపైరిమ్ 0.48 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి ఏదైనా ఒక పురుగు మందును మొక్క మొదలు తడిసేటట్లుగా పిచికారీ చేయాలి. రెండోసారి పిచికారీ చేయాల్సి వచ్చినప్పుడు మొదట వాడిన మందులను కాకుండా మార్చి వాడాలి. ముఖ్యంగా దోమ ఉద్ధృతిని పెంచే పురుగు మందులను ఎట్టి పరిస్థితుల్లో వాడరాదని సూచించారు.



పంటను ఆశించిన దోమ

మీరూ అడగొచ్చు

ప్రశ్న: సపోటాలో కాయ తొలుచు పురుగుని ఎలా అరికట్టాలి? - రామచంద్రరావు, వెంకటాపురం

సమాధానం: గుడ్డు నుంచి వెలువడిన గొంగళి పురుగులు కాయ లోపలికి తొలిచి గుజ్జును తిని పురుగు విసర్జితాలతో రంధ్రం మూసి ఉంటుంది. పూర్తిగా పెరిగిన గొంగళి పురుగు కాయ నుంచి వెలుపడి కోశస్థ దశను గడుపుతుంది. తర్వాత దశలో శిలీంద్రం ఆశించడం వల్ల కాయలు కుళ్లిపోతాయి. దీని నివారణకు వేప గింజల కషాయం 5 శాతం లేదా వేప నూనె 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి లేత చిగురు, పూత దశలలో వారం రోజుల వ్యవధిలో మందులకు మార్చి మార్చి పిచికారీ చేయాలి.



డాక్టర్ ఇ.కరుణశ్రీ, ప్రధాన శాస్త్రవేత్త కృషి విజ్ఞాన కేంద్రం, వెంకట్రామన్నగూడెం

✆ చరవాణి 73826 33692

ఉద్యాన విశ్వవిద్యాలయం న్యూస్‌టుడే

ఇలా చేస్తే.. జామలో మంచి దిగుబడులే

పోడూరు, న్యూస్‌టుడే: జామ తోటల్లో సమగ్ర ఎరువుల, పోషకాల యాజమాన్యంతో నాణ్యమైన దిగుబడిని పొందవచ్చునని తణుకు ఉద్యానశాఖాధికారి ప్రియదర్శిని తెలిపారు. ఈ సాగులో ఎరువులు, పోషకాల యాజమాన్యంపై ఆమె పలు విషయాలు వివరించారు. ఏడాది వయసు కలిగిన జామ చెట్టుకు 200 గ్రాముల యూరియా, 250 గ్రాముల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 100 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి. రెండు నుంచి మూడు సంవత్సరాల వయసు కలిగిన చెట్లకు 400 గ్రాముల యూరియా, 500 గ్రాముల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 350 గ్రాములు మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి. నాలుగో సంవత్సరం నుంచి 850 గ్రాముల యూరియా, కేజీ సింగిల్ సూపర్ ఫాస్పేట్, 850 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి. ఈ మోతాదులను ఏప్రిల్-జూన్ నెలలో 50 శాతం, అక్టోబర్ - నవంబరు నెలలో మరో 50 శాతం వేయాలి. వీటితోపాటు ఏటా కనీసం 10 నుంచి 15 కిలోల పశువుల ఎరువు, 2 నుంచి 5 కిలోల వేప పిండి తప్పనిసరిగా వేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు.





చెక్కులను ఎమ్మెల్యేకు అందజేస్తున్న డీఎన్నార్ పాలకవర్గం

వరద బాధితులకు చేయూత

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: విజయవాడలో వరద బాధితుల సహాయార్థం భీమవరం డీఎన్నార్ విద్యా సంస్థల తరఫున రూ.2.59 లక్షల విరాళం ఇచ్చారు. దీనికి సంబంధించిన చెక్కులను డీఎన్నార్ పాలకవర్గ కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు, ఉపాధ్యక్షుడు జి.పాండురంగరాజు, సంయుక్త కార్యదర్శి కూనపరాజు రామకృష్ణరాజు, పరిపాలన విభాగాధికారి పి.రామకృష్ణంరాజు, ప్రధానోపాధ్యాయులు సీహెచ్ నిర్మల, బి.శ్రీనివాసరావు తదితరులు ఎమ్మెల్యే రామాంజనేయులుకు మంగళవారం అందజేశారు.

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: పాలకోడేరు మండల పరిధిలో పంచాయతీరాజ్ శాఖ, గ్రామ సచివాలయాల సిబ్బంది రూ.56 వేల విరాళం అందించారు. ఈ మేరకు చెక్కును భీమవరం ఎంపీడీవో మురళీ గంగాధరరావు మంగళవారం కలెక్టర్ నాగరాణికి అందజేశారు.

అడవి బాపిరాజుకు నివాళి

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రముఖ రచయిత, భీమవరం వాసి అడవి బాపిరాజు జయంతిని భీమవరంలోని క్విట్ ఇండియా స్తూపం ప్రాంగణంలో శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు న్యూటన్, మాజీ అధ్యక్షుడు ఎంవీ రమణ తదితరులు బాపిరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బ్యూటీ పార్లర్ నిర్వాహకురాలి ఆత్మహత్య

ఆచంట(మార్టేరు), న్యూస్‌టుడే: అప్పులు పాలైన బ్యూటీ పార్లర్ నిర్వాహకురాలు మనస్తాపానికి గురై మంగళవారం బలవన్మరణానికి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. ఆచంట వేమవరం గ్రామానికి చెందిన షేక్ రజీయా(33) ఇంట్లో పంకాకు చీర కట్టి ఉరి వేసుకున్నారు.

బడి జట్టు.. అదిరేట్టు!

హ్యాండ్‌బాల్ రాష్ట్ర పోటీలకు ఎంపిక

పాలకోడేరు, న్యూస్‌టుడే

పాలకోడేరు మండలం మోగల్లు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల జరిగిన స్కూల్‌గేమ్స్ మండల, నియోజకవర్గ, డివిజన్, జిల్లా స్థాయి పోటీల్లో సత్తాచాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. హ్యాండ్ బాల్ అండర్-14, 17 విభాగాల్లో ఈ పాఠశాలకు చెందిన ముగ్గురు బాలికల జట్టుకు, నలుగురు బాలుర జట్టుకు ఎంపికయ్యారు. దసరా సెలవుల అనంతరం జరిగే రాష్ట్ర స్థాయి పోటీల కోసం వ్యాయామ ఉపాధ్యాయుడు రాంబాబు ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న వీరు తమ భవిష్యత్తు లక్ష్యాలను ఇలా వివరించారు.



ఎంపికైన విద్యార్థులు

సత్తా చాటుతాం



"గతేడాది అండర్-14 విభాగంలో హ్యాండ్ బాల్ జిల్లా జట్టు తరఫున గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నా. గతం కంటే మెరుగైన ప్రతిభ చూపాలనే లక్ష్యంతో ప్రస్తుతం సాధన చేస్తున్నా. ఈ కచ్చితంగా విజయం సాధిస్తాం." - ఆర్.మానస

చక్కటి ప్రోత్సాహం



"దాతల సహకారంతో మా పాఠశాల మైదానాన్ని అభివృద్ధి చేసి హ్యాండ్ బాల్ కోర్టును ఏర్పాటు చేయడంతో సాధనకు అనుకూలంగా ఉంది. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో నిత్యం సాధన కొనసాగిస్తున్నాం. ఈ సారి రాష్ట్ర స్థాయి పోటీల్లో కచ్చితంగా విజయం సాధిస్తామనే నమ్మకం ఉంది." - ఎం.నాగేంద్రబాబు

కొత్త మెలకువలతో..



"గతేడాది విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొని మెరుగైన ప్రతిభ చూపా. ఈ సారి విజయం సాధించాలనే లక్ష్యంతో కొత్త మెలకువలపై ఉదయం, సాయంత్రం వేళ సాధన చేస్తున్నా." - పి.తరుణ్

గుర్తింపు కోసం..



"గతేడాది కూడా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈసారి విజయం సాధించి పాఠశాలకు, జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో కఠోర సాధన చేస్తున్నాం. పీడీ సూచనలు, సలహాలు పాటిస్తూ కొత్త మెలకువలు నేర్చుకుంటున్నాం.' - ఎం.హర్షిత దుర్గ

మమ్మేలు.. మహాలక్ష్మీ..!



ఆకివీడు: రూ.40 లక్షల నగదుతో అలంకరణ

భీమవరం ఆధ్యాత్మికం, కాళ్ల, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పలు ఆలయాల్లో అమ్మవార్లు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పంచారామక్షేత్రం గునుపూడి సోమేశ్వరజనార్దన స్వామి ఆలయంలో పార్వతీమాతను మహా చండి రూపంలో అలంకరించి కుంకుమ పూజలు నిర్వహించారు. భీమేశ్వరస్వామి ఆలయంలో మహిషాసురమర్దని అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గునుపూడి గ్రామదేవత ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ ఆలయంలో అమ్మవారిని సుమారు రూ. 15 లక్షల నగదుతో నేత్రపర్వంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కాళ్ల మండలం దొడ్డపూడి గ్రామంలో రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయాన్ని సుమారు రూ.27 లక్షల నగదుతో అలంకరించారు.



భీమవరంలో ఆదిలక్ష్మి..



ఉండి: రామక్షేత్రంలో...

ఉండి, ఆకివీడు, పాలకోడేరు, న్యూస్‌టుడే: ఉండిలో రామక్షేత్రంలో అమ్మవారిని ధనలక్ష్మిగా అలంకరించారు. ఆకివీడులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అమ్మవారిని, మండపాన్ని రూ.40 లక్షల నగదుతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పాలకోడేరు కొత్తపేటలో కనకదుర్గమ్మ ఆలయంలో సామూహికంగా కుంకుమ పూజలు నిర్వహించారు.



మహాలక్ష్మీపురంలో కుంకుమ పూజలు

వీరవాసరం, న్యూస్‌టుడే: వీరవాసరం, తోలేరు గ్రామాల్లోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాల్లో విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు.

గంజాయి ముఠా అరెస్టు

పెదపారుపూడి, న్యూస్‌టుడే: గంజాయి రవాణా చేస్తున్న 15 మందిని కృష్ణా జిల్లా పెదపారుపూడిలో అరెస్టు చేశామని ఎస్పీ గంగాధరరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెదపారుపూడి హిందూ శ్మశానవాటిక వద్ద కొంత మంది గంజాయి పీలుస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్.ఐ. ప్రవీణ్ కుమార్ రెడ్డి సిబ్బందితో వెళ్లి 15 మంది నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుంచి 8 కిలోల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, ఆరు చరవాణులు స్వాధీనం చేసుకున్నారన్నారు. నిందితులందరూ గుడివాడ, ఏలూరు, భీమవరం ప్రాంతాలకు చెందిన వారుగా గుర్తించామన్నారు. గుడివాడ చెంచుపేట కాలనీకి చెందిన కుంచం ఆశీర్వాదం ఓ కేసులో బందరు జైలులో ఉన్నప్పుడు ఏలూరుకు చెందిన ఏసీ మెకానిక్ శక్తి జశ్వంత్, కొల్లూరి శ్రీనివాస్, భీమవరానికి చెందిన ఫణీంద్రతో పరిచయం ఏర్పడింది. విలాసాలు, చెడు వ్యసనాలకు బానిసలైన వారంతా కలిసి గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్నట్లు తేలిందని ఎస్పీ తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

రూ.3 లక్షల సొత్తు స్వాధీనం

పాలకోడేరు, న్యూస్‌టుడే: పలు జిల్లాల్లో వరుస చోరీలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేసినట్లు భీమవరం రూరల్ సీఐ బి.శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. తూర్పుగోదావరి జిల్లా చాగల్లు గ్రామానికి చెందిన డొక్కు సాయికిరణ్ జల్సాల కోసం చోరీలకు పాల్పడుతున్నాడు. జిల్లాలో పాలకోడేరు, ఉండి, పాలకొల్లు రూరల్ పోలీస్‌స్టేషన్లలో అతడిపై చోరీ కేసులు నమోదయ్యాయి. అతడి కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు గొల్లలకోడేరు వద్ద మంగళవారం అరెస్టు చేశారు. చోరీ చేసిన సొత్తును ఆకివీడు మండలం గుమ్ములూరుకు చెందిన మండా రాజేశ్‌కు ఇస్తున్నట్లు గుర్తించి అతడ్ని కూడా అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3 లక్షల విలువైన కెమెరాలు, ల్యాప్‌టాప్‌లు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. వీరిని భీమవరం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండు విధించినట్లు తెలిపారు.

శిక్షణ సంస్థల ఎంపికకు దరఖాస్తులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ ఇచ్చే సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డు కులాల సాధికారిత అధికారి కె.శోభారాణి తెలిపారు. దరఖాస్తుకు ఈ నెల 21వ తేదీ వరకు వరకు గడువు ఉందన్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.25 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

దోమల నిర్మూలన చర్యలు



పనులు పర్యవేక్షిస్తున్న కమిషనర్ అంజయ్య

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణంలో దోమల నిర్మూలన చర్యలు చేపట్టారు. మంగళవారం పురపాలక కమిషనర్ ఎం. అంజయ్య పర్యవేక్షణలో పారిశుద్ధ్య కార్మికులు పొగ(ఫాగింగ్) వేశారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, కిశోర్, చిట్టూరి కృష్ణ తదితరులు ఉన్నారు.

దుకాణాల వేలం ఖరారు



వేలం నిర్వహిస్తున్న అధికారులు

నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం పురపాలక సంఘానికి చెందిన దుకాణ సముదాయం వేలం పాట ఖరారైందని కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో దుకాణ సముదాయంలో ఖాళీగా ఉన్న 43 దుకాణాలకు మంగళవారం వేలంపాట నిర్వహించారు. ఈ పాటలో పలువురు పాల్గొని హెచ్చు పాటకు పాడారని ఆయన తెలిపారు. రెవెన్యూ అధికారి ఎస్వీ రామారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎ.నానాజీ తదితరులు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న ఏడీఏ అనిల్ కుమార్

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: వరి సాగులో రైతులు ఆధునిక యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ ఇ.అనిల్ కుమార్ అన్నారు. సరిపల్లి, లిఖితపూడి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆమె రైతులను ఉద్దేశించి మాట్లాడారు. డ్రోన్ ద్వారా పురుగు మందు పిచికారీ చేయాలని, సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టాలని సూచించారు.

పరిస్థితులకు అనుగుణంగా సస్యరక్షణ..

మార్టేరు, న్యూస్‌టుడే: వరి పంటలో పరిస్థితులకు అనుగుణంగా సస్య రక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఎ.జ్యోష్టిలా రైతులకు సూచించారు. ఓడూరు గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వచ్చిన మార్పులు గురించి తెలిపారు. వ్యవసాయ సహాయకుడు బి.శివన్నారాయణ పలు విషయాలను వివరించారు.

టెన్నిస్‌లో ఆణిముత్యాలు

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



పోలీస్ అధికారినవుతా: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2023 నవంబర్‌లో కాకినాడలో రాష్ట్రస్థాయి అండర్-14 విభాగంలో, జాతీయ స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం సాధించాను. ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన టెన్నిస్ పోటీల్లో అండర్-10 విభాగంలో విన్నర్‌గా నిలిచాను. క్రీడల కోటా ద్వారా ఉన్నత స్థాయి పోలీస్ అధికారిని కావాలనేది లక్ష్యం.
- వీరవల్లి భువన్ ధీరజ్, 7వ తరగతి, పాలకొల్లు



పట్టుదలతో: విజయవాడలో జరిగిన అండర్-12 విభాగంలో విన్నర్, అండర్-14 విభాగంలో రన్నర్‌గా నిలిచాను. 2023లో పాలకొల్లులో జరిగిన జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-14 విభాగంలో ద్వితీయస్థానంలో నిలిచాను. పట్టుదలతో కృషి చేసి మంచి క్రీడాకారుడినవుతా.
- చిమకొండ దుర్గాశ్రీ అఖిల్, 9వ తరగతి, పాలకొల్లు



పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: సాధించాలన్న తపన.. కఠోర శ్రమ.. విజయతీరాలకు చేరాలన్న కోరిక.. ఆత్మవిశ్వాసం.. గురువుల సహకారానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం తోడైతే ఏ రంగంలోనైనా అద్భుతాలు సృష్టించవచ్చు. తమలోని నైపుణ్యాలను వెలికితీసి భవిష్యత్తును అద్భుతంగా తీర్చిదిద్దుకోవచ్చు. ఈ దిశగా వచ్చిన అవకాశాలను గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు రాకెట్ ఝులిపిస్తూ కీర్తిని చాటుకొంటున్నారు ఆ విద్యార్థులు. పాలకొల్లు కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న టెన్నిస్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను 'న్యూస్‌టుడే' పలకరించింది.



విజేతగా నిలిచా.. బెంగళూరులో హస్టర్ ఓపెన్ టోర్నమెంట్ టెన్నిస్‌లో అండర్-12 విభాగంలో విన్నర్‌గా నిలిచాను. రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొనడం ఇదే మొదటిసారి. భవిష్యత్తులో మంచి క్రీడాకారుడిగా రాణించాలనేది నా లక్ష్యం.
- గొట్టుముక్కల హరీశ్, 6వ తరగతి, బెంగళూరు



ఛాంపియన్‌గా నిలుస్తా: హైదరాబాద్, రాజమండ్రి, విజయవాడల్లో జరిగిన టెన్నిస్ అండర్-8, 10 విభాగాల్లో విన్నర్‌గా నిలిచాను. ఇండియన్ టెన్నిస్ ఛాంపియన్‌గా నిలవాలనేది నా కోరిక.
- ఇ.దాశిక్, 2వ తరగతి, పాలకొల్లు



వింబుల్డన్‌లో ఆడాలని: ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్, విజయవాడల్లో జరిగిన టెన్నిస్ పోటీల్లో అండర్-10 విభాగంలో ప్రథమస్థానం, అండర్-12 విభాగంలో విన్నర్, అండర్-14 విభాగంలో విన్నర్‌గా నిలిచాను. ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భువనేశ్వర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో అండర్-12 విభాగంలో 147వ ర్యాంకు, అండర్-14 విభాగంలో 403 ర్యాంకు సాధించాను. వింబుల్డన్‌లో ఆడాలనేది నా కోరిక.
- నున్నబోయిన లేఖ్యశ్రీ, 8వ తరగతి



అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తా: విశాఖపట్నం, గుంటూరు, రాజమండ్రి, విజయవాడలలో రాష్ట్ర స్థాయిలో జరిగిన టెన్నిస్ పోటీలు అండర్-10 విభాగంలో రెండు చోట్ల రన్నర్‌గా, మరో రెండుచోట్ల విన్నర్‌గా నిలిచాను. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలనేది నా కోరిక.
- టి.లక్షిత్ చౌదరి, 9వ తరగతి, విశాఖపట్నం

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



వ్యాపారితో మాట్లాడుతున్న తహసీల్దార్ ఫాజిల్

పోడూరు, న్యూస్‌టుడే: కూరగాయలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సయ్యద్ మౌలాన్ ఫాజిల్ వ్యాపారస్థులను హెచ్చరించారు. పోడూరులో ఆయన పలు కూరగాయ దుకాణాలను సందర్శించి ఉల్లి, టమాట ధరలపై ఆరా తీశారు. కూరగాయలను ఎక్కడ కొనుగోలు చేసి తీసుకొస్తారు.. ధరను ఏ రకంగా నిర్ణయిస్తారో తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిమాండ్‌ను ఆసరా చేసుకుని ఇష్టానుసారంగా ధరలు పెంచి అమ్మకాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నియంత్రణకు కృషి చేయాలి

పెనుగొండ, న్యూస్‌టుడే: నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు కేతా గోపాలన్ తెలిపారు. మంగళవారం స్థానిక బీసీ కల్యాణ మండపంలో సీపీఎం పెనుగొండ గ్రామ మహాసభలో ఆయన మాట్లాడుతూ వంట నూనెలు, కూరగాయలు తదితర ధరలు పెరిగాయని, పేదలకు నిత్యావసర సరకులను చౌక దుకాణాల ద్వారా అందించాలని డిమాండ్ చేశారు. సీపీఎం శాఖ పెనుగొండ కార్యదర్శిగా నాగిశెట్టి గంగారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నరసాపురం, న్యూస్‌టుడే: నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరుతూ మంగళవారం సీపీఎం నాయకులు మొగల్తూరులో నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో యడ్ల చిట్టిబాబు, వీరా పాండురంగారావు, కొల్లాటి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికలతో పంచాయతీల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీడీవో సూర్యనారాయణ మూర్తి

పెనుగొండ, న్యూస్‌టుడే: పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్తే పంచాయతీల అభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీడీవో టి.సూర్యనారాయణ మూర్తి తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామాల నిర్వహణ, స్వచ్ఛతపై ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు నిర్వహించిన మండల స్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చెత్త నుంచి సంపదను సృష్టించుకోవాలని వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సీహెచ్ఎస్వీ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో సరఫరా చేస్తున్న సురక్షిత తాగునీరు వృథా కాకుండా చూడాల్సిన బాధ్యత స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులపై ఉందని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈఈ టి.లోకేశ్ అన్నారు. ఏపీఎస్ఐఆర్డీ ఆధ్వర్యంలో మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు ఉప-సర్పంచులు, వార్డు సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో రక్షిత మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయడం, కుళాయిల ద్వారా వచ్చే నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడటం, పైపు లైన్ల లీకేజీని సకాలంలో నియంత్రించడం తదితర అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా సీతారాపురం సౌత్ ఉప సర్పంచి కూనపరెడ్డి ఏసు మాట్లాడుతూ రక్షిత తాగునీటి సరఫరా విషయంలో గ్రామ పంచాయతీల భాగస్వామ్యాన్ని పెంచాలన్నారు. ఓహెచ్ఆర్ఎస్‌లను నిర్దేశించిన సమయానికి శుభ్రం చేసి వ్యాధులకు తావులేని సురక్షిత నీటిని సరఫరా చేయాలన్నారు. సమావేశంలో ఎల్‌బీ చర్ల వార్డు సభ్యులు కటకంశెట్టి సుభాకర్ మాట్లాడుతూ లక్ష్మణేశ్వరం భారీ రక్షిత మంచినీటి పథకం చెరువుకు గొల్లల వంతెన వద్ద నున్న పంట కాలువ నుంచి పంపింగ్ చేయకుండా నరసాపురం ప్రధాన పంట కాలువ నుంచి నీటిని చెరువులోకి వదులుతూ నీటి కాలుష్యాన్ని అరికట్టాలన్నారు. మాస్టర్ ట్రైనీ, కొప్పర్రు గ్రామ కార్యదర్శి బి.ఆనందబాబు, ఈవోపీఆర్డీ కె.నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

సమష్టి కృషితో.. మొగల్తూరు, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని ఎంపీడీవో త్రిశూల పాణి సూచించారు. మొగల్తూరు మండల పరిషత్తు సమావేశ మందిరంలో పంచాయతీ వార్డు సభ్యులు, ఉప సర్పంచులకు రెండ్రోజుల శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభించారు. పంచాయతీ రాజ్ చట్టం 1994, గ్రామ, ఆదాయ వనరులు, లేఅవుట్లు, సమావేశాలపై ప్రొసీజర్ కోడ్, పారిశుద్ధ్య నిర్వహణ, లీగల్ లిటరసీ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈవోఆర్డీ మేడిద నవీన్ కిరణ్, టీవోటీ ఐ.రాజు, సమన్వయకర్త సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎన్.ఎన్.ఉమా మహేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామ స్వరాజ్ అభియాన్ వార్షిక కార్యాచరణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరాలకు సంబంధించి ప్రణాళికను వివరించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారులతో భాగస్వామ్యంతో పూర్తి చేసుకోవాలన్నారు. గ్రామాల అభివృద్ధికి కలిసికట్టుగా ముందుకు వెళ్లాలన్నారు.

నీటి సంఘాలకు పూర్వ వైభవం తెద్దాం



నరసాపురం: వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో రాజు

నరసాపురం, న్యూస్‌టుడే: నీటి సంఘాలకు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసి పూర్వ వైభవం తీసుకువద్దామని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆయన అమరావతి నుంచి రెవెన్యూ డివిజన్ అధికారులతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడారు. సాగు నీటి సంఘాలు అన్న ఎన్టీఆర్ హయాంలోనే ప్రారంభమయ్యాయన్నారు. వైకాపా పాలనలో నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా సాగునీటి వ్యవస్థను భ్రష్టు పట్టించారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నీటి సంఘాలకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ఎన్నికల ప్రక్రియ ఈ నెల 16 నుంచి ప్రారంభించి 40 రోజులు కొనసాగుతుందన్నారు. ఓటర్ల జాబితాలు సిద్ధం చేయించాలని రామానాయుడు సూచించారు.

రేషన్ దుకాణాలు పరిశీలించిన ఆర్డీవో .. పెనుమంట్ర, న్యూస్‌టుడే: మండలంలోని జుత్తిగ, సోమరాజు ఇల్లింద్రపర్రు గ్రామాల్లోని రేషన్ దుకాణాలను నరసాపురం ఆర్డీవో దాసి రాజు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, రెవెన్యూ సిబ్బందితో ఆయన మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో కొద్దిసేపు తహసీల్దార్ వై.రవికుమార్‌తో పలు అంశాలపై చర్చించారు. దుకాణాల పునర్విభజన చేయనున్న నేపథ్యంలో స్థానికంగా ఉన్న దుకాణాలు, కార్డుదారుల సంఖ్య గురించి ఆరా తీశారు.

బాలలతో పని చేయించడం నేరం

నరసాపురం, న్యూస్‌టుడే: బాలలతో పని చేయించడం చట్టరీత్యా నేరమని కార్మికశాఖ అధికారులు, న్యాయవాదులు వెల్లడించారు. మండల న్యాయసేవాధికార సంస్థ, కార్మికశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో వ్యాపార దుకాణాలను సందర్శించి యజమానులకు అవగాహన కల్పించారు. కార్మికులను పనిలో నియమించుకునే సమయంలో వారికి 18 ఏళ్లు నిండినట్లు నిర్ధారించుకోవాలని సూచించారు. అనంతరం పట్టణంలో అవగాహనా ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఇద్దరు బాల కార్మికులతో పని చేయిస్తున్న రెండు దుకాణాలను గుర్తించామని, వారిపై తగు చర్యలు తీసుకుంటామని పాలకొల్లు కార్మికశాఖ సహాయ అధికారి కేబీఆర్ శర్మ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు చల్లా దానయ్య నాయుడు, ఫణికర్, సతీశ్, పోలీసు, స్త్రీ శిశు సంక్షేమశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



న్యాయవాదుల ప్రదర్శన

తల్లికి, తండ్రికి కొడుకులా మారిన కుమార్తె



తండ్రికి తలకొరివి పెట్టడానికి వెళ్తున్న కూతురు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: తల్లిదండ్రుల రుణం తీర్చుకోవడం కొడుకుల వంతే కాదని, కూతుర్ల బాధ్యత కూడా అని చైతన్య అనే మహిళ నిరూపించుకొంది. స్థానిక 22వ వార్డు కొత్తపేటకు చెందిన యర్రంశెట్టి బాపయ్యనాయుడు(70) న్యాయవాదిగా పనిచేసి ఏడాది కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మరణించారు. గత ఏడాది డిసెంబర్‌లో ఆమె తల్లి మరణించగా కొడుకులు లేకపోవడం, తండ్రి అనారోగ్యంతో మంచంపై ఉండటం, బంధువులు ఎవరూ తలకొరివి పెట్టడానికి ముందుకు రాకపోవడంతో కుమార్తె పెట్టింది. ఇప్పుడు తండ్రి కూడా చనిపోవడంతో ఆమె తలకొరివి పెట్టింది.

మడుగులా రహదారి

మొగల్తూరు, న్యూస్‌టుడే: మొగల్తూరు నుంచి భీమవరం గ్రామీణ మండలం వెంప వరకూ ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారి ధ్వంసమైంది. ఈ మార్గంలో పలుచోట్ల పెద్దపెద్ద గుంతలు ఏర్పడి కొద్దిపాటి వర్షం కురిసినా నీరు వాటిల్లో నిలిచి మడుగులను తలపిస్తున్నాయి. చిన్నపాటి వర్షానికే రహదారిపై గుంతల్లో నీరు నిలిచి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మండలంలోని పలుగ్రామాల ప్రజలు జిల్లా కేంద్రం భీమవరం నిత్యం ఈ రహదారిపైనే రాకపోకలు సాగిస్తుంటారు. సమస్యపై ర.భ శాఖ డీఈ కిరణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి చర్యలు చేపడతానని చెప్పారు.






మొగల్తూరు - పడమటిపాలెం రహదారిపై నిలిచిన వాననీరు

చూడ చక్కని.. మర్రి వృక్షం

పాలకొల్లు సాంస్కృతికం, న్యూస్‌టుడే: పాలకొల్లు పట్టణం బొర్రావారి తోట కాలనీలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ప్రహరీకు ఆనుకుని ఓ మర్రి చెట్టు పెద్ద వృక్షంలా పెరిగింది. ఆ చెట్టు వేర్లు ఎవరో అంటు కట్టినట్లుగా లతలాగా అల్లుకుని చెట్టు మొదలు ఎంతో ఆకర్షణీయంగా చూపరులకు కనువిందు చేస్తోంది. స్థానికులు ఈ చెట్టు కొమ్మలు, కాయలు పూజలకు తీసుకెళ్తూ ఉంటారు.



ఆధునిక విద్యా విధానంలో ఆటలు ఎంతో అవసరం

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: ఆధునిక జీవన విద్యావిధానంలో క్రీడలు ఎంతో అవసరమని గ్రామీణ సీఐ శ్రీనివాస్ అన్నారు. స్థానిక కాస్మో పాలిటన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రుద్రరాజు పద్మరాజు మెమోరియల్ రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు ఆరోగ్యం కూడా ముఖ్యమేనని, ఆరోగ్యవంతమైన జీవన విధానం ఉండాలంటే క్రీడలు దోహదపడతాయన్నారు. అండర్-8, 10, 12, 14 విభాగాలకు చెందిన 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కాస్మోకల్చరల్ స్పోర్ట్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు ఆర్.సత్యనారాయణరాజు, కోశాధికారి రమేశ్ బాబు, క్షత్రియ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెరుకూరి సూర్యనారాయణరాజు, ఆర్గనైజింగ్ అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, రాజా సూరిబాబురాజు, కేవీ కృష్ణవర్మ పాల్గొన్నారు.

శివశంకరి.. శివానంద లహరి



వాసవీశాంతిధాంలో మహాలక్ష్మీదేవి అలంకరణలో

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామిని ఉజ్జయిని మహా కాళేశ్వరుడిగా అలంకరించారు. అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ● వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అమ్మవారిని గాయత్రీ దేవి రూపంలో అలంకరించారు. ● యడ్లబజారు కనకదుర్గ ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తున్నారు.



ధనలక్ష్మిగా మార్టేరు కనకదుర్గమ్మ



క్షీరారామంలో మహా కాళేశ్వరుడిగా..

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని స్టీమర్ రోడ్లో పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అమ్మవారికి కాత్యాయని దేవిగా అలంకరించారు.

పెనుగొండ, న్యూస్‌టుడే: స్థానిక నగరేశ్వర, మహిషాసురమర్దని, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం ఉదయం ఏకాదశ రుద్రాభిషేకాలు, సూర్యనమస్కారాలు, కుంకుమ పూజలు చేశారు.

●వాసవీశాంతి ధాంలో మంగళవారం గోమాత పూజ, పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు, హోమాలు చేశారు.

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: దుర్గమ్మ మహాలక్ష్మమ్మ అవతారంలో దర్శనమిచ్చారు. చిట్టవరం, లిఖితపూడి, కొప్పర్రు, సీతారాంపురం నార్త్, సీతారాంపురం సౌత్, పితానిమెరక తదితర గ్రామాల్లో భక్తులు దుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



క్షీరారామంలో లలితా త్రిపుర సుందరీ దేవిగా

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవ రాత్రుల మహోత్సవాలు పురస్కరించుకుని పాలకొల్లు పట్టణం చిత్రాయి చెరువుగట్టున ఉన్న ముఖధారమ్మ ఆలయంలో అమ్మవారికి మంగళవారం జలాభిషేకం చేశారు.

పెనుమంట్ర, పోడూరు, ఆచంట, న్యూస్‌టుడే: మార్టేరు శివరావుపేటలోని శ్రీకనకదుర్గమ్మ ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మార్టేరు కామాక్షి అమ్మవారిని సూర్యకిరణాలు తాకడంతో భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు.

ఇరువర్గాలపై కేసు

నరసాపురం, న్యూస్‌టుడే: ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు వేర్వేరుగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ టి.పాపారావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన కథనం మేరకు.. పట్టణానికి చెందిన పూడి యాకోబు గల్ఫ్ వెళ్లేందుకు జిన్నూరుకు చెందిన ప్రేమ్ కుమార్ వద్ద గతంలో రూ.లక్ష అప్పు తీసుకున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురైన ప్రేమ్‌కుమార్ తాను అప్పుగా ఇచ్చిన నగదు తీసుకురావాలని కుసుమే కిశోర్‌ను ఈ నెల 2న నరసాపురం పంపించాడు. కిశోర్ తన మేనత్త అయిన పూడి బెట్టిసుభారత్నం(యాకోబు భార్య)ను రూ.లక్ష తిరిగి ఇవ్వాలని కోరాడు. దీంతో ఆగ్రహించిన బెట్టిసుభారత్నం, ఆమె ఇంటి సమీపంలో నివసిస్తున్న పోడూరు పోలీస్‌స్టేషన్ హెచ్‌సీగా పనిచేస్తూ సెలవులో ఉన్న సింగ్‌తో కలిసి కిశోర్, ఆయన సోదరుడిని కొట్టి గాయపరిచారు. దీనిపై కిశోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ తెలిపారు.

● ఈ నెల 2న తన మేనల్లుడు కుసుమే కిశోర్ తన కుమార్తె పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు అత్యాచార యత్నం చేశాడని పూడి బెట్టి సుభారత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన యలమంచిలి మండలం చించినాడలో జరిగింది. యలమంచిలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనసీమ జిల్లా మలికిపురం మండలం మట్టపర్రుకు చెందిన చెల్లబోయిన నాగచైతన్య(21), గెడ్డం సూర్య కిరణ్‌లు లైటింగ్ పనులు చేస్తుంటారు. ఈ నెల 6న ఇద్దరూ కలిసి కాళ్ళ మండలంలోని ఒక పని నిమిత్తం వారి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా చించినాడ జాతీయ రహదారి వంతెన దిగువకు వచ్చేసరికి ఎదురుగా ఒక కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో నాగ చైతన్యకు తీవ్ర గాయాలయ్యాయి. అతని స్నేహితుడు సూర్య కిరణ్‌కు స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు వారిని పాలకొల్లులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. నాగచైతన్యను మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. దీంతో మంగళవారం మృతుడి తండ్రి వీరాంజనేయులు ఫిర్యాదు మేరకు ఏఎస్సై దుర్గారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆసుపత్రిలో వృద్ధుడి .. మొగల్తూరు, న్యూస్‌టుడే: కడుపునొప్పి తాళలేక పురుగుల మందు తాగిన వృద్ధుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై మంగళవారం కేసు నమోదు చేశామని హెచ్‌సీ ఎస్‌కేపీ సుభాన్ తెలిపారు. దీనికి సంబంధించి హెచ్‌సీ కథనం మేరకు తూర్పుతాళ్లు పంచాయతీ కరింశెట్టిపాలేనికి చెందిన కొల్ల వరప్రసాద్ (59) గత కొంతకాలంగా కడుపు నొప్పితో ఇబ్బంది పడుతున్నారు. దీంతో మనస్తాపం చెందిన ఆయన రెండ్రోజుల కిందట పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం ఆయన్ను కుటుంబ సభ్యులు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 7న మృతిచెందారు. దీనికి సంబంధించి వరప్రసాద్ కుమారుడు బాబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సుభాన్ తెలిపారు.

అవి ఇవి అన్నీ

పనుల పరిశీలన.. పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పట్టణంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను వెంటనే చేపట్టే విధంగా పరిశీలించమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఎన్డీయే నాయకులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం హిందూ శ్మశాన వాటిక, చంద్రబాబునాయుడు ఉద్యానవనం, కాటన్ పార్క్, అంబేడ్కర్ భవనం వంటి అభివృద్ధి పనులను కూటమి నాయకులు జీవీ, పెచ్చెట్టి బాబు, జగ్రోతు రాంబాబులు మున్సిపల్ కమిషనర్ బి.విజయసారథి, సిబ్బందితో కలిసి పరిశీలించారు.

వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి.. పెనుమంట్ర, న్యూస్‌టుడే: వివిధ సీజన్‌లలో ప్రబలే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య శాఖ సబ్ యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు క్షేత్రస్థాయి ఉద్యోగులకు సూచించారు. పెనుమంట్ర పీహెచ్‌సీలో మంగళవారం ఆశా డే సమీక్ష సమావేశం జరిగింది. దీనికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల రీత్యా ఫ్రైడే.. డ్రై డే కార్యక్రమాన్ని నిత్యం నిర్వహించాలని ఆదేశించారు.

వచ్చే నెల 6 వరకు పట్టభద్రుల ఓటు నమోదుకు అవకాశం .. నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: వచ్చే నెల 6వ తేదీలోగా పట్టభద్రుల ఓటు నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ టి.రాజ రాజేశ్వరి కోరారు. ఓటరు గుర్తింపు కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటో, ఆధార్ కార్డుతో పాటు డిగ్రీ ధ్రువపత్రాలు తహసీల్దారు కార్యాలయానికి తీసుకువచ్చి ఓటు నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ సూచించారు.

నూతన పాస్టర్ల సంఘ కార్యవర్గం ఎన్నిక.. ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట మండల పాస్టర్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నికైంది. గౌరవ అధ్యక్షుడిగా పొలుమూరి శేఖర్‌బాబు, అధ్యక్షుడిగా ఇంజేటి డేవిడ్, ఉపాధ్యక్షుడిగా కె.సువర్ణరాజు, ప్రధాన కార్యదర్శిగా పారుపల్లి ఏసురత్నం, జాయింట్ కార్యదర్శిగా నక్కా సన్నీబాబు, ట్రెజరర్‌గా నక్కా తిమోతి, ఎగ్జిక్యూటివ్‌గా కె.డేవిడ్, డైరెక్టర్‌గా కె.విజయరావులను ఎన్నుకున్నారు. గాదిరాజు తిమోతిరాజు, బి.డేవిడ్‌రాజు అధ్యక్షతన ఆచంటలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి పాస్టర్లు హాజరయ్యారు.

భాజపా సభ్యత్వ నమోదు.. మొగల్తూరు, న్యూస్‌టుడే: మొగల్తూరు పంచాయతీ వడయార్ పేట, గరువు పల్లపాలెం తదితర గ్రామాల్లో మంగళవారం భాజపా నాయకులు ఆ పార్టీ సభ్యత్వ నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో కవురు శ్రీనివాస్, మామిడిశెట్టి నరసింహారావు, బెల్లపు నాగేశ్వరరావు, దొంగ రామారావు, నాగిడి భగవాన్, సాన నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు.. పెనుమంట్ర, న్యూస్‌టుడే: జుత్తిగలోని ఉమా వాసుకీ రవి సోమేశ్వర స్వామి దేవస్థానంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం ప్రత్యేక పూజాభిషేకాలు నిర్వహించారు. పంచామృతాలతో జరిగిన అభిషేకం కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పూజల అనంతరం స్వామిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ఆవులను రహదారులపై వదలకుండా చూడాలి.. మొగల్తూరు, న్యూస్‌టుడే: రహదారులపైకి ఆవులను వదిలే వాటి యజమానులపై చర్యలు తీసుకోవాలని, నిషేధిత ప్లాస్టిక్ సామగ్రి విక్రయాలు జరగకుండా చూడాలని కోరుతూ మంగళవారం రామకృష్ణ చారిటబుల్ ట్రస్టు సభ్యులు పలు శాఖల అధికారులకు వినతిపత్రం అందించారు. రహదారులపై ఆవులను వదలడంతో అవి ప్రమాదాలబారిన పడి మృతి చెందుతున్నాయని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తణుకుల రామకృష్ణ, వెలిది బాబీ, మైలవరపు లోకేశ్, ముక్కు రాజేశ్, మోహన్ జోగేశ్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

బాధ్యతల స్వీకరణ



ఆర్డీవో భవానీ శంకరికి పుష్పగుచ్ఛం అందజేత

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్ ఆర్డీవోగా వై.భవానీశంకరి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో నూజివీడు ఆర్డీవోగా పనిచేసిన ఆమె సాధారణ బదిలీల్లో భాగంగా తాడేపల్లిగూడెం వచ్చారు. తాడేపల్లిగూడెం తహసీల్దారు సునీల్ కుమార్, రెవెన్యూ సిబ్బంది ఆర్డీవోను కలిసి స్వాగతం పలికారు.

దాతలకు కమిటీల్లో స్థానం: బొలిశెట్టి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

తాడేపల్లిగూడెం వన్‌టౌన్,న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం, మాధవరం ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులకు గ్రామస్థులు పూర్తి సహాయ, సహకారాలు అందించాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో దాతలకు కమిటీల్లో స్థానం కల్పిస్తామని తెలియజేశారు. మంగళవారం వెంకట్రామన్నగూడెం ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన వెంకట్రామన్నగూడెం, మాధవరం ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి కమిటీల సమావేశంలో మాట్లాడారు. వైద్య సిబ్బంది, ఎన్డీఏ నాయకులు పాల్గొన్నారు.



నిరుపయోగంగా చెత్త రిక్షాలు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామాల్లో చెత్త సేకరణకు కొనుగోలు చేసిన చెత్త సేకరణ రిక్షాలను నిరుపయోగంగా వదిలేస్తున్నారు. అత్తిలి మండలం స్కిన్నెరపురం పంచాయతీకి చెందిన చెత్త సేకరణ రిక్షా మరమ్మతుకు గురైంది. కార్యాలయం ఎదురుగా ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పు పడుతోంది. దీనికి మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకొస్తామని పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: పెదతాడేపల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ సీఐ శివరామకృష్ణ మంగళవారం పట్టుకున్నారు. గోదాముల్లో అక్రమంగా నిల్వ ఉంచుతున్నారన్న సమాచారంతో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. సుమారు రూ.5.8 లక్షలు విలువైన 145 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసినట్లు తెలియజేశారు.

నృత్య కళ.. ప్రతిభ భళా

కూచిపూడిలో రాణిస్తున్న చిన్నారులు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: సాధారణంగా రోజులు మారుతున్న కొద్దీ పాత సంప్రదాయాలకు స్వస్తి పలికి కొత్తవాటికి అలవాటు పడుతుంటారు. ఇటువంటి తరుణంలో కొంతమంది చిన్నారులు సంప్రదాయ కళలపై ఆసక్తి పెంచుకున్నారు. తణుకులోని కూచిపూడి కళాక్షేత్రంలో నృత్యంలో శిక్షణ పొందుతూ పేరుప్రఖ్యాతులు సంపాదిస్తున్నారు. పదేళ్ల కూడా నిండని వారు ఒంగోలు, ద్వారకాతిరుమల, విజయవాడ తదితర ప్రాంతాల్లో ఎన్నో ప్రదర్శన లిస్తూ భళా అనిపించుకుంటున్నారు. దసరా మహోత్సవాలను పురస్కరించుని పలు చోట్ల ప్రదర్శనలు ఇస్తున్నారు. వారి మనోగతాన్ని ‘న్యూస్‌టుడే’తో ఇలా పంచుకున్నారు.



నేను నాలుగో తరగతి చదువుతున్నా. నృత్య కళపై మక్కువతో ఏడాది కాలంగా కూచిపూడి నృత్యం నేర్చుకుంటున్నా. ఇప్పటి వరకు ఒంగోలు, ద్వారకాతిరుమల, విజయవాడ తదితర ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చి అనేక మంది మన్ననలు పొందా. రానున్న రోజుల్లో మరింత సాధన చేసి అవార్డులు సొంతం చేసుకుంటా. ఐఏఎస్ అవ్వాలని లక్ష్యంగా పెట్టుకుని కృషి చేస్తున్నా. -వి.లాస్య



ఆరో తరగతి చదువుతున్నా. నృత్యంపై నా ఆసక్తిని అమ్మ గమనించి ఏడాదిన్నరగా గురువు వద్ద కూచిపూడిలో శిక్షణ ఇప్పిస్తోంది. ఆమె నుంచి మెలకువలు నేర్చుకుని పలు చోట్ల ప్రదర్శనలు ఇస్తున్నా. పోటీల్లో అవార్డులు సొంతం చేసుకున్నా. ఉన్నతంగా చదువుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో స్థిరపడాలని ధ్యేయం. - మేఘన



మా అమ్మ కూచిపూడి నృత్య కళాకారిణి. ఆమె ప్రోత్సాహంతో ఒకటో తరగతి నుంచి కూచిపూడిలో శిక్షణ పొందుతున్నా. రానున్న కాలంలో మరిన్ని మెలకువలు నేర్చుకుని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధిస్తా. -సీహెచ్ ద్రితి



ఎనిమిదో తరగతి చదువుతున్నా. పాఠశాలలో నృత్య ప్రదర్శనలు చూసి ఆసక్తి పెరిగింది. స్నేహితులతో కలిసి ప్రదర్శనలు ఇస్తూ పెద్దల మన్ననలు పొందా. వైద్యురాలిగా స్థిరపడి పేదలకు సేవ లందిస్తా. -ఎం వర్షిణి



మా అమ్మ సూచనలతో కూచిపూడి నృత్యంపై పట్టు సాధిస్తున్నా. ఆసక్తి పెరిగి మెలకువలు నేర్చుకున్నా. పలు చోట్ల ప్రదర్శనలు ఇస్తూ అవార్డులు సైతం సొంతం చేసుకున్నా. నాకు చిన్నప్పటినుంచి పశువులంటే చాలా ఇష్టం. పశువైద్యురాలిగా రైతులకు సేవ లందించాలని కోరిక. -బి.లక్ష్మీ అక్షయ

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే

సమస్య: పట్టణంలోని కడకట్ల వంతెనపై గోతులు అధికంగా ఉన్నాయి. వాహన చోదకులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. **-ధర్మేంద్ర, స్థానికుడు**

సమాధానం: గోతులు పూడ్చి సమస్య పరిష్కరిస్తాం. **-ఏసుబాబు, మున్సిపల్ కమిషనర్**

సమస్య: స్థానిక ఏలూరు రోడ్డులో విభాజకంపై ఏర్పాటు చేసిన వీధి దీపాలు పూర్తిస్థాయిలో వెలగడం లేదు. **-రంగారావు, స్థానికుడు**

సమాధానం: వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టి వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **-ఏసుబాబు, మున్సిపల్ కమిషనర్**

తాడేపల్లిగూడెం వన్‌టౌన్,న్యూస్‌టుడే

సమస్య: తాడేపల్లిగూడెం పట్టణం గణేష్‌నగర్ నుంచి శశి కళాశాలకు వెళ్లే రోడ్డులో చెత్త పేరుకుని రహదారిలోకి వస్తోంది. **- సంతోష్, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి రహదారిలో చెత్తను తొలగించేలా చర్యలు చేపడతాం. **-శ్రీమన్నారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

పెంటపాడు, న్యూస్‌టుడే

సమస్య: పెంటపాడు మండలం కస్పాపెంటపాడు తూర్పు ఎస్సీ కాలనీలో ప్రధాన మురుగు కాలువ వ్యర్థాలతో పూడిపోవడంతో మురుగు ముందుకెళ్లడంలేదు. వీధుల్లో వర్షపు నీరు నిలిచిపోతోంది. **- లక్ష్మణ్, స్థానికుడు**

సమాధానం: మురుగు కాలువల్లో పూడిక తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. **- పీతల సత్యనారాయణ, సర్పంచి**

సమస్య: పెంటపాడు మండలం రాచర్లలోని పలు వార్డుల్లో డ్రెయిన్లు వ్యర్థాలతో పూడిపోయాయి. ఫలితంగా దోమలు విజృంభిస్తున్నాయి. **- సాయి, స్థానికుడు**

సమాధానం : డ్రెయిన్లలో పూడిక తొలగించి దోమల మందు పిచికారీ చేయిస్తాం. **- బేగ్, పంచాయతీ కార్యదర్శి**

సమస్య : పడమరవిప్పర్రు పంచాయతీ కార్యాలయానికి సమీపంలోని వీధుల్లో వానరులు, శునకాల బెడద ఎక్కువగా ఉంది. ప్రతిరోజూ అవి వీధుల్లో సంచరిస్తూ ప్రజలపై దాడులు చేస్తున్నాయి. **- రామకృష్ణ, స్థానికుడు**

సమాధానం : సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- శోభన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి**

సమస్య : పరిమెళ్ల ఎస్సీ కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. **- రమేష్, కాలనీవాసి**

సమాధానం : దోమల మందు పిచికారీ చేయిస్తాం. **- నాగదేవి, పంచాయతీ కార్యదర్శి**

సమష్టి కృషితో స్వచ్ఛ గ్రామాలు



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: స్వచ్ఛ గ్రామాల సాధనకు సమష్టి కృషి చేయాలని ఇరగవరం ఎంపీడీవో శ్రీనివాస్, తణుకు ఈవోపీఆర్డీ రామ్‌ప్రసాద్ కోరారు. ఉప సర్పంచులు, వార్డు సభ్యుల రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మాట్లాడారు. గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఇరగవరం ఎంపీపీ మంగతాయారు, తణుకు ఏవో కృష్ణచంద్ పాల్గొన్నారు.

సర్పంచులకు శిక్షణ తరగతులు.. అత్తిలిగ్రామీణం, న్యూస్‌టుడే : అత్తిలి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధ, గురు వారాలు సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శామ్యూల్ తెలిపారు.

ఇసుక సరఫరా చేయాలంటూ ఆందోళన

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు మామిడి దానవరప్రసాద్ పేర్కొన్నారు. శేషమహల్ కూడలిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో ఇసుక దొరక్క చాలా మంది ఇబ్బంది పడుతున్నారన్నారు.



మండపాక యల్లారమ్మ



అత్తిలి: చాముండేశ్వరీ దేవి



లక్ష్మీదేవి అలంకరణలో విశ్వదుర్గేశ్వరి



బలుసులమ్మ



సర్వమంగళ అమ్మవారు



కాత్యాయిని రూపంలో..

వరప్రదాయని..జగజ్జనని



సామూహిక కుంకుమ పూజలు

తణుకు గ్రామీణం, అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకు నియోజకవర్గంలోని పట్టణ, గ్రామల్లో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మండపాక యల్లారమ్మను మంగళవారం మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. ● పట్టణంలోని వాసవీమాత శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా వాసవీమాతను అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ● వేల్పూరు శ్రీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని రూ.6.66 లక్షలతో మహాలక్ష్మీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు.● అత్తిలి పెద్దవంతెన వద్ద కొలువైన చాముండేశ్వరిదేవికి విశేష అలంకరణ చేశారు.



వేల్పూరులో ..

తాడేపల్లిగూడెం అర్బన్,వన్‌టౌన్, న్యూస్‌టుడే: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి క్షేత్రంలోని వాసవీ అమ్మవారు లక్ష్మీదేవి అలంకారంలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయ ప్రాంగణాన్ని, అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు.* వీరంపాలెం బాలాత్రిపుర సుందరి పీఠంలో అమ్మవారు కాత్యాయినిగా భక్తులకు దర్శనమిచ్చారు. పీఠ నిర్వాహకులు గరిమెళ్ల వెంకటరమణశాస్త్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈనాడు కథనానికి స్పందన

పట్టెంపాలెం(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం పట్టెన్నపాలెం, వీరంపాలెం గ్రామాల్లో ఎర్ర కాలువ పరివాహక ప్రాంతంలో “ఇసుక దందా” జరుగుతుందని ఈ నెల 7న “ఈనాడు”లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మండల తహసీల్దారు ఎమ్. సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్, రెవిన్యూ సిబ్బందితో మంగళవారం ఉదయం తనిఖీలు నిర్వహించారు.

మెరుగైన వైద్య సేవలందించండి

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : వైద్య సిబ్బంది ప్రతి రోజు జ్వర పీడితుల సర్వే నిర్వహించి గుర్తించిన వారి వివరాలు ఆసుపత్రిలో అందించి వైద్య సేవలు అందేలా కృషి చేయాలని తణుకు సబ్ యూనిట్ ఆరోగ్య అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం అత్తిలి పీహెచ్‌సీలో నిర్వహించిన ఆశా డే సమీక్ష సమావేశంలో పాల్గొని సూచనలిచ్చారు. అత్తిలి, మంచిలి పీహెచ్‌సీల వైద్యాధికారులు నాగరాజు, చాముండేశ్వరీ, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం.. తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కార్యాలయం వద్ద వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు భూపతిరాజు రమేష్ చంద్రబాబు 36 మందికి రక్తపోటు, మధుమేహం తదితర వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. సంఘ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, సత్యనారాయణ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని 20వ వార్డులో శ్రీ కనకదుర్గా ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా భాజపా జిల్లా నాయకుడు నరిశే సోమేశ్వరరావు శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 300 మంది రక్తపోటు, మధుమేహం, కీళ్లనొప్పులు తదితర రోగాలకు సంబధించి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

ప్రమాదకరంగా వారధులు



రక్షణ గోడలు శిథిలమైన మంచిలి వంతెన



ఆరవల్లి కాలువపై

అత్తిలిగ్రామీణం, న్యూస్‌టుడే : అత్తిలి మండలంలో పలు వంతెనలు, కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. గత అయిదేళ్ల వైకాపా కాలంలో గ్రామాల్లో వంతెనలు, కల్వర్టులు శిథిలావస్థకు చేరాయి. దీంతో ప్రయాణికులు ప్రమాదాలబారిన పడుతున్నారు..గత ఐదేళ్లుగా కనీస నిర్వహిణ లేకపోవడంతో కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. కొన్ని వంతెనలకు రెయిలింగ్‌లు ధ్వంసమయ్యాయి. మంచిలి గ్రామం ప్రధాన రహదారిలో కాలువ పై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ వంతెనకు ఇరువైపులా మలుపులు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరవల్లి గ్రామంలో ప్రధాన రహదారిపై నిర్మించివ వంతెన పూర్తిగా శిథిలమైపోయింది. కంచుమర్రు, ఈడూరు, కొమ్మర, పాలి, పాలూరు గ్రామాల్లో నిర్మించిన వంతెనలు, కల్వర్టులు శిథిలావస్థకు చేరుకున్నాయి. రాత్రి సమయాల్లో ఈ వంతెనలపై వాహనచోదకులు, ప్రయాణికులు ప్రయాణం చేయడానికి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వంతెనలు, కల్వర్టులు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. పరిశీలించి వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతామని ర.భ.శా జేఈ యశ్వంత్ చెప్పారు.

నేడు కౌన్సిల్ సర్వసభ్య సమావేశం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. నగర పాలక సంస్థలో ముగ్గురు కో-ఆప్షన్ సభ్యుల పదవులు ఖాళీ కాగా, వాటిని భర్తీ చేయనున్నారు. ఈ పదవులకు తెదేపా అభ్యర్థులు కొల్లేపల్లి రాజు, చోడే వెంకటరత్నం, జాలా సుమతి ఇటీవల నామపత్రాలు సమర్పించారు. వైకాపా నుంచి ఎవరూ నామినేషన్లు వేయకపోవడంతో... వీరి ఎన్నిక దాదాపు ఖరారైంది. ఉదయం 10:30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, సభ్యులంతా విధిగా హాజరు కావాలని అదనపు కమిషనర్ చంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: కీటక జనిత వ్యాధుల నివారణకు వార్డుల్లో అపరిశుభ్ర ప్రాంతాలు గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. పట్టణంలోని యాగర్లపల్లి, కడకట్ల, వీకర్స్‌కాలనీ ప్రాంతాల్లోని పట్టణారోగ్య కేంద్రాలో ఆశా డే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిశుభ్ర ప్రాంతాలను శుభ్రం చేయించాలన్నారు. పట్టణారోగ్య కేంద్రాల్లో ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలి

పెంటపాడు, న్యూస్‌టుడే: రైతుల సమస్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం పెంటపాడు ఎస్‌టీవీఎన్ హిందూ ఉన్నత పాఠశాలలో రైతు సంఘం ఉమ్మడి జిల్లా కార్యకర్తల శిక్షణ శిబిరం హరేరామ్ అధ్యక్షతన నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలన్నారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు, శిరపరపు రంగారావు, పుల్లారెడ్డి, పెనగంటి దుర్గా, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: ఈ నెల 5, 6, 7 తేదీల్లో కర్నూలులో నిర్వహించిన యోగాసన రాష్ట్ర స్థాయి పోటీల్లో తణుకు పట్టణానికి చెందిన కార్తీక ఉషశ్రీదుర్గ బంగారు పతకం సాధించారు. మంత్రి భరత్, కర్నూలు ఐపీఎస్ బిందు మాధవ్, డీఎస్పీ మోహబాబూ చేతుల మీదుగా బంగారు పతకం అందించారు. ● ఇండియన్ స్పేస్ ఆర్గనైజేషన్, సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) ఆధ్వర్యంలో ఆదివారం భీమవరంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో తణుకు ఎస్ఎఫ్ఎస్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచారని ప్రధానోపాధ్యాయులు రెవ.ఫాదర్ షైజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్థిని తేజస్వీ ప్రథమ, తొమ్మిదో తరగతి విద్యార్థి సాయి కిరణ్ తృతీయ స్థానాల్లో గెలుపొందినట్లు తెలిపారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు

నారాయణపురం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: అల్ప(లో వోల్టేజీ) విద్యుత్తు సమస్యను పరిష్కరించి, వినియోగదారులకు నాణ్యమైన సరఫరా చేయాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సూచించారు. నారాయణపురంలోని క్యాంపు కార్యాలయంలో విద్యుత్తు శాఖాధికారులతో మంగళవారం నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... సరిపల్లిలో 132 కేవీ విద్యుత్తు ఉపకేంద్రం నిర్మాణానికి మరో ఎకరా భూమి సేకరించి త్వరితగతిన పనులు చేపట్టాలన్నారు. విద్యుత్తు శాఖాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు సమన్వయంతో పని చేసి విద్యుత్తు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. స్థానికులు, ఎన్డీయే నాయకులు విద్యుత్తు సమస్యలపై ఏకరవు పెట్టారు. నారాయణపురం, గొల్లగూడెం ఉప కేంద్రాల్లోని విద్యుత్తు నియంత్రికల సామర్థ్యం పెంచాలని ఐస్ పరిశ్రమల సంఘం అధ్యక్షుడు వేగేశ్న రంగరాజు వినతిపత్రం అందజేశారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, జనసేన నాయకుడు వట్టి పవన్‌కుమార్, ఈఈలు నరసింహారావు, అంబేడ్కర్, ఏడీఏలు బి.రామకృష్ణ, గోపాలకృష్ణ, డి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాలువలో ఒకరి గల్లంతు

తణుకు గ్రామీణం , న్యూస్‌టుడే : స్నానానికి దిగి భవాని భక్తుడు గల్లంతైన సంఘటన మంగళవారం రాత్రి తణుకు మండలం తేతలిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. తేతలికి చెందిన కాజా దుర్గాప్రసాద్ (23) ఇటుకల బట్టిలో పని చేస్తుంటారు. మూడు నెలల కిందటల వివాహం చేసుకుని, తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నారు. ఇటీవల భవానీ మాల ధరించిన దుర్గాప్రసాద్ మంగళవారం రాత్రి తేతలి వద్ద అత్తిలి కాలువలో స్నానానికి దిగి గల్లంతయ్యారు.

వేధింపుల కేసు నమోదు చేయాలి

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే : ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై ఎస్సీఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని ఆల్ ఇండియా పులే అంబేడ్కర్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు, దళిత ఐక్యవేదిక అధ్యక్షుడు పొట్ల సురేశ్ డిమాండ్ చేశారు. కాళ్ల పోలీస్ స్టేషన్ ముట్టడిని అడ్డుకోవడంలో భాగంగా మంగళవారం పొట్ల సురేష్‌ను స్థానిక పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తప్పు చేసిన వారిని వదిలి ఉద్యమకారులను అరెస్టు చేయడం సరికాదన్నారు.

పాడి పశువుల్లో ఉత్పాదక శక్తి పెంచాలి



మాట్లాడుతున్న సత్యకుమారి

పెంటపాడు, న్యూస్‌టుడే : పాడి పశువుల్లో ఉత్పాదక శక్తి మరింత పెంచే దిశగా గ్రామీణ ప్రాంత పశువైద్యులు కృషి చేయాలని పశుసంవర్ధక శాఖ అదనపు సంచాలకులు సత్యకుమారి అన్నారు. మంగళవారం పెంటపాడు పశుసంవర్ధకశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పశువైద్యాధికారులతో సమావేశం నిర్వహించి మండలాల వారీగా పశువైద్యాధికారుల పని విధానం అడిగి తెలుసుకున్నారు. రైతు సేవా కేంద్రాల సహాయకుల సేవలను సరైన రీతిలో ఉపయోగించుకోవాలని సూచించారు. శాస్త్ర పరిజ్ఞానం రైతులకు చేరవేయడం ద్వారా మాత్రమే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు కృషి



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ దినేశ్‌శంకర్‌రెడ్డి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ రహిత పర్యావరణ స్థాపనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఏపీ నిట్ రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఏపీ నిట్ ప్రాంగణంలో సర్క్యులర్ ఎకానమీ అప్రోచ్ ఫర్ మిటిగేషన్ ఆఫ్ ప్లాస్టిక్ వేస్ట్ అంశంపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ పర్యావరణానికి తీవ్ర హాని చేకూర్చుతుందన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పుస్తకాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాలువ కలుషితంతో దుర్గంధం



అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి బస్టాండు కూడలి వద్ద కొన్ని రోజులుగా కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా చెదారం, మృత కళేబరాలు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మృత కళేబరాల నుంచి తీవ్ర దుర్గంధం వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువలో చెత్తాచెదారాలు, వ్యర్థాలు లేకుండా చర్యలు తీసుకుంటామని జలవనరుల శాఖ ఏఈ అనిల్ తేజ తెలిపారు.

చెత్త ప్రాంగణం



అత్తిలిగ్రామీణం, న్యూస్‌టుడే : అత్తిలి మండలం స్కిన్నెరపురం శివారు చలివేంద్రచెరువు ప్రధాన రహదారిపై నిర్మించిన బస్సు షెల్టర్ నిరుపయోగంగా మారింది. బస్సు షెల్టర్ చెత్తా, చెదారం తుప్పలతో నిండిపోయింది. ఈ గ్రామం నుంచి అనేక మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు.